MAHANAGAR DINAPATRIKA

మహానగర్

విజయవాడ | సంపుటి : 10 | సంచిక : 310 | పేజీలు : 8 | శుక్రవారం 30 అక్టోబర్ 2026 | వెల : 6-00



- తుపాన్ బాధితులకు సీఎం చంద్రబాబు భరోసా
- ప్రాథమిక అంచనా ప్రకారం రూ.4,600 కోట్ల నష్టం
- కొబ్బరి, ఆయిల్‌పామ్ చెట్టుకు రూ.1,500 పరిహారం
- బాధిత కుటుంబాలకు 25 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు
- విద్యుత్ పునరుద్ధరణకు అదనపు సిబ్బంది
- నష్టాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించిన ముఖ్యమంత్రి

ఆందోళన వద్దు.. ఆదుకుంటాం



అమరావతి, మహానగర్

అర్నబ్ తుపాన్ ప్రభావంతో నష్టపోయిన ప్రజలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భరోసా ఇచ్చారు. తుపాన్ కారణంగా ప్రాథమిక అంచనా ప్రకారం రాష్ట్రంలో సుమారు రూ.4,600 కోట్ల నష్టం వాటిల్లినట్లు వెల్లడించారు. బాధితులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, నష్టాన్ని అంచనా వేసి సహాయక చర్యలను వేగవంతం చేస్తామని తెలిపారు. గురువారం తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన ఆయన.. దెబ్బతిన్న పంటలు, విద్యుత్ వ్యవస్థ, నివాస ప్రాంతాలను పరిశీలించారు. పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్న బాధితులతో మాట్లాడి వారి



సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మొదట ఏరియల్ వ్యూ ద్వారా తుపాన్ ప్రభావిత ప్రాంతాలను పరిశీలించిన ముఖ్యమంత్రి, అనంతరం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని కాట్రేనికోన మండలానికి చేరుకున్నారు. చెయ్యేరు, వేట్లపాలెం, గచ్చకాయలపార గ్రామాల్లో పర్యటించి తుపాన్ కారణంగా దెబ్బతిన్న ప్రాంతాలను పరిశీలించారు. పంటలు నష్టపోయిన రైతులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. పునరావాస కేంద్రాల్లో ఉన్న ప్రజల అవసరాలు, వారికి అందుతున్న సదుపాయాలపై ఆరా తీశారు. అనంతరం ముమ్మిడివరం నియోజకవర్గంలోని గచ్చకాయలపార గ్రామంలో నిర్వహించిన మీడియా సమావేశంలో సీఎం మాట్లాడుతూ.. - మిగతా 2లో



పోలీసుల లాఠీలకు భయపడొద్దు

- నవంబర్ 1న ర్యాలీకి తరలిరండి
- ప్రజలకు రాహుల్ గాంధీ పిలుపు
- ఇండీ కూటమి నవంబర్ 1న తలపెట్టిన చలో దిల్లీ ర్యాలీలో ప్రతిఒక్కరూ పాల్గొనాలి
- తమ కుతంత్రాలను ప్రయోగించే దమ్ము బీజేపీకి లేదు
- దేశాన్ని కాపాడుకోవడానికి కలిసికట్టుగా నడుద్దాం

5



డిజిటల్ మోసాలకు బ్యాంకులే నష్టపరిహారం చెల్లించేలా జవాబుదారీగా చేయాలి

- బ్యాంకులే నష్టపరిహారం చెల్లించాలి
- అసాధారణ లావాదేవీలపై నిఘా
- తగ్గిన డిజిటల్ అరెస్ట్ కేసులు
- విద్యావంతులూ మోసపోతున్నారు
- డిజిటల్ అరెస్టులపై సీజేఐ ఆగ్రహం

బంగాళాఖాతంలో మరో అల్పపీడనం


- అర్నబ్ తుపాను ప్రభావం నుంచి కోలుకోకముందే మరో ముప్పు
- దక్షిణ అండమాన్ సముద్రంలో కొత్త అల్పపీడనం
- రానున్న 48 గంటల్లో వాయుగుండంగా మారే అవకాశం
- నవంబర్ 2, 3 తేదీల్లో ఉత్తర, దక్షిణ కోస్తాంధ్రలో భారీ వర్షాలు
- కొత్త హెచ్చరికతో రైతులు, తీరప్రాంత ప్రజల్లో ఆందోళన

5



పరిశ్రమలకు ఫుల్ జోష్

- 48 అజెండా అంశాలకు ఆమోదం
- అమరావతి నిర్మాణానికి రూ.1,925 కోట్ల పనులు
- డేటా సెంటర్, సెమీకండక్టర్ ప్రాజెక్టులకు గ్రీన్‌సిగ్నల్
- భారీ పెట్టుబడులకు భూకేటాయింపులు
- క్వాంటమ్ వ్యాలీలో హార్డ్‌వేర్ తయారీ పార్కు



అమరావతి, మహానగర్

పెట్టుబడులకు గ్రీన్ సిగ్నల్, పరిశ్రమలకు ఫుల్ జోష్ అమరావతి నిర్మాణానికి మరింత ఊపు, రాష్ట్ర అభివృద్ధికి ఊతం ఇచ్చేలా రాష్ట్ర మంత్రివర్గం కీలక నిర్ణయాలు తీసుకుంది. భారీ పారిశ్రామిక ప్రాజెక్టుల నుంచి సెమీకండక్టర్ తయారీ వరకు సాగునీటి పనుల నుంచి స్వచ్ఛ ఇంధనం వరకు పలు రంగాలకు సంబంధించిన ప్రతిపాదనలకు పచ్చజెండా ఊపింది. భూకేటాయింపులు, పెట్టుబడుల ప్రోత్సాహకాలు, మౌలిక సదుపాయాల - మిగతా 2లో



రబీ సాగుపై ఎల్‌నినో పంజా

- దేశవ్యాప్తంగా 59 శాతం పడిపోయిన గోధుమల సాగు
- ఆందోళనలో రైతులు!
- ఎల్‌నినో ఎఫెక్ట్ రబీ పంటల సాగుపైనా పడింది
- దేశంలో ఈ రబీ పంటల సాగు విస్తీర్ణం 28.26 లక్షల హెక్టార్ల నుంచి 18.02 లక్షల హెక్టార్లకు తగ్గింది

5

రెబల్ అభ్యర్థులపై వెంటనే వేటు వేయండి

- పొత్తు ధర్మాన్ని తప్పనిసరిగా పాటించాలి
- ఎన్డీఏ అభ్యర్థుల గెలుపు బాధ్యత మంత్రులదే
- జిల్లా ఇన్‌ఛార్జులు సమన్వయంతో పనిచేయాలి
- స్థానిక ఎన్నికలకు ఇప్పటి నుంచే సిద్ధం కావాలి

2



తుపాను బాధితులకు అండగా నిలవండి

- పార్టీ శ్రేణులకు జగన్ పిలుపు
- ప్రభుత్వ సహాయక చర్యలు పూర్తిగా విఫలమయ్యాయని జగన్ విమర్శ
- టీడీపీ నేతలు బియ్యం మాఫియాను ప్రోత్సహిస్తున్నారని ఆరోపణ
- సోనా మసూరి బియ్యం ధర కేజీ రూ.90 దాటిందని వ్యాఖ్య

అమరావతి, మహానగర్

అర్నబ్ తుపాను బాధిత ప్రాంతాల్లో ప్రజలకు అండగా నిలవాలని వైసీపీ అధినేత జగన్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో సహాయక చర్యలు విఫలమయ్యాయని విమర్శించారు. అధికార పార్టీ నేతలు 'బియ్యం మాఫియా'ను ప్రోత్సహిస్తూ కృత్రిమ కొరత సృష్టిస్తున్నారని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి జిల్లా అధ్యక్షులు, రీజనల్ కో-ఆర్డినేటర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ... 'గ్రామ, వార్డు సచివాలయాల నిర్వీర్యం, వాలంటీర్ల వ్యవస్థ రద్దు ప్రభావం తుపాను సహాయక చర్యలపై స్పష్టంగా - మిగతా 2లో



ఆందోళన వద్దు..ఆదుకుంటాం

-మొదటిపేజీ తరువాయి

క్షేత్రస్థాయిలో పర్యటిస్తేనే ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, జరిగిన నష్టం గురించి వాస్తవ పరిస్థితులు తెలుస్తాయని పేర్కొన్నారు. అందుకే నేరుగా ప్రభావిత ప్రాంతాలకు వచ్చి పరిస్థితిని పరిశీలించినట్లు తెలిపారు.

చెట్టుకు రూ.1,500 పరిహారం

తుపాన్ కారణంగా నష్టపోయిన రైతులకు సహాయం అందిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. దెబ్బతిన్న ఒక్కో కొబ్బరిచెట్టుకు రూ.1,500, ఆయిల్‌పామ్ చెట్టుకు కూడా రూ.1,500 చొప్పున పరిహారం అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పంటలు, తోటలు, ఇతర ఆస్తులకు జరిగిన నష్టాన్ని అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి అంచనా వేయాలని సూచించారు. నష్టపోయిన రైతులకు సహాయం అందించే ప్రక్రియలో జాప్యం జరగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. వ్యవసాయంపై ఆధారపడి జీవించే కుటుంబాలకు తగిన భరోసా కల్పించడం ప్రభుత్వ బాధ్యతని పేర్కొన్నారు.

బాధితులకు బియ్యం, నిత్యావసర సరుకులు

పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందిన కుటుంబాలు తిరిగి తమ ఇళ్లకు వెళ్లే సమయంలో సహాయం అందిస్తామని చంద్రబాబు తెలిపారు. ఒక్కో కుటుంబానికి 25 కిలోల బియ్యం, నిత్యావసర సరుకుల ప్యాకెట్‌తో పాటు ఖర్చుల కోసం నగదు అందించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. తుపాన్ కారణంగా ఇళ్లు, నివాస ప్రాంతాలు దెబ్బతిన్నవారికి అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ప్రజలు సాధారణ జీవనానికి తిరిగి చేరుకునే వరకు సహాయక చర్యలు కొనసాగించాలని స్పష్టం చేశారు. పునరావాస కేంద్రాల్లో తాగునీరు, ఆహారం, ఇతర అవసరమైన సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలని అధికార యంత్రాంగానికి సూచించారు.

విద్యుత్ పునరుద్ధరణకు ప్రత్యేక చర్యలు

కోనసీమ జిల్లాలో తుపాన్ కారణంగా సుమారు 8 వేల విద్యుత్ స్తంభాలు నేలకొరిగినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలను తిరిగి ఏర్పాటు చేసి, వీలైనంత త్వరగా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని ఆదేశించారు. విద్యుత్ శాఖ సిబ్బంది నిరంతరం పనిచేస్తూ పరిస్థితిని చక్కదిద్దాలని సూచించారు. పునరుద్ధరణ పనులకు అదనపు సిబ్బంది అవసరమవడంతో తెలంగాణ ప్రభుత్వంతో మాట్లాడి వెయ్యి మంది సిబ్బందిని పంపాలని కోరినట్లు తెలిపారు.



అవసరమైతే కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి కూడా సిబ్బందిని రప్పిస్తామని వెల్లడించారు. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడకుండా పునరుద్ధరణ పనులను ప్రాధాన్య క్రమంలో చేపట్టాలని అధికారులకు సూచించారు.

దెబ్బతిన్న నివాసాల పునరుద్ధరణకు ఆదేశాలు

తుపాన్ ప్రభావంతో దెబ్బతిన్న పాకలు, నివాసాలను పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇళ్లు దెబ్బతిని ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు అవసరమైన సహాయం అందించాలన్నారు. ప్రజలకు తక్షణ ఉపశమనం కలిగించే పనులను ముందుగా చేపట్టి, అనంతరం ఇతర పునరుద్ధరణ కార్యక్రమాలను పూర్తి చేయాలని సూచించారు.

మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి సూచన

పర్యటన సందర్భంగా పలువురు మత్స్యకారులు తమ పడవల రిజిస్ట్రేషన్ లేకపోవడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన చంద్రబాబు, సమస్యను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు సూచించారు. తుపాన్ కారణంగా ఉపాధి కోల్పోయిన మత్స్యకారుల సమస్యలను కూడా పరిశీలించి పరిష్కార మార్గాలు చూపాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

ఏడుగురి మృతి.. సహాయక చర్యలపై దృష్టి

తుపాన్ సమయంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ దురదృష్టవశాత్తూ ఏడుగురు ప్రాణాలు కోల్పోయారని చంద్రబాబు తెలిపారు. ఇలాంటి ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజల ప్రాణాలను కాపాడటం, నష్టాన్ని తగ్గించడం ప్రభుత్వానికి అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. తుపాన్లు రావడం లేదని, ప్రభుత్వం అతిగా జాగ్రత్తలు తీసుకుంటోందని విమర్శించే విషయాలను పట్టించుకోవాల్సిన అవసరం లేదని అధికారులకు సూచించారు. ప్రజల రక్షణ, సహాయక చర్యలపైనే దృష్టి పెట్టాలని స్పష్టం చేశారు.

కేంద్ర బృందాల పర్యటన

తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో జరిగిన నష్టాన్ని పరిశీలించేందుకు కేంద్ర బృందాలు శుక్రవారం పర్యటించనున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. కేంద్ర బృందాలు క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించి నష్టాన్ని అంచనా వేయనున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం కూడా నష్టం వివరాలను సేకరించి అవసరమైన నివేదికలను సిద్ధం చేస్తోందని వెల్లడించారు. తుపాన్ కారణంగా నష్టపోయిన రైతులు, మత్స్యకారులు, ఇతర బాధిత కుటుంబాలకు సహాయం అందించడంతో పాటు విద్యుత్ సరఫరా, నివాసాలు, మౌలిక సదుపాయాల పునరుద్ధరణను వేగవంతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని చంద్రబాబు తెలిపారు.

పరిశ్రమలకు ఫుల్ జోష్

-మొదటిపేజీ తరువాయి

విస్తరణతో రాష్ట్రంలో పారిశ్రామిక, ఆర్థిక కార్యకలాపాలకు ఊతమిచ్చే నిర్ణయాలు తీసుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన వర్చువల్?గా జరిగిన మంత్రివర్గ సమావేశంలో 48 అజెండా అంశాలకు ఆమోదం తెలిపింది. ఈ భేటీలో రాజధాని నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అమరావతి ప్రభుత్వ సముదాయంలోని జీఏడీ టవర్‌లో విద్యుత్, శీతలీకరణ, అగ్నిమాపక భద్రత, లిఫ్టులు, ఫైర్ అలారాలు, పబ్లిక్ అడ్రస్ వ్యవస్థ, ప్లంబింగ్ తదితర హైసైడ్ మెకానికల్, ఎలక్ట్రికల్, ప్లంబింగ్ పనులకు రూ. 448.31 కోట్ల టెండర్‌కు ఆమోదం తెలిపారు. టవర్లు 1, 2లో ఇదే తరహా పనులకు రూ. 768.89 కోట్లు, టవర్లు 3, 4లో పనులకు రూ. 708.12 కోట్ల కాంట్రాక్టు ప్రతిపాదనలకు ఆమోదముద్ర వేశారు. మూడు పనుల మొత్తం కాంట్రాక్టు విలువ దాదాపు 19వందల 25.33 కోట్లు. పన్నులు, సుంకాలు అదనం. అత్యల్ప టెండర్‌దారుల బిడ్లను ఆమోదించి పనులు అప్పగించేందుకు ఏజీఐసీఎల్? మేనేజింగ్ డైరెక్టర్‌కు అధికారం కల్పించే ప్రతిపాదనకు ఆమోదం లభించింది.

పారిశ్రామిక అభివృద్ధి విధానం 4.0:

డిజిటల్ మౌలిక సదుపాయాల అభివృద్ధిలో భాగంగా విశాఖపట్నం జిల్లా అడవివరం, ముడసర్లోవ ప్రాంతాల్లో జీవీఎంసీకి చెందిన 5.84 ఎకరాల భూమిని విజాగ్ హైపర్‌స్కేల్ డేటా సెంటర్ పార్క్ లిమిటెడ్‌కు లీజుకు ఇచ్చే ప్రతిపాదనకు ఆమోదం లభించింది. అదానీ ఇన్‌ఫ్రా ఇండియా అనుబంధ సంస్థ అయిన ఈ కంపెనీకి ప్రత్యేక రాయితీలు కల్పించారు. విజయనగరం జిల్లా శ్రీరాంపురంలో స్టీల్ ఎక్స్‌పోజ్ ఇండియా లిమిటెడ్‌కు 5 వేల194 కోట్ల పెట్టుబడితో ఏడాదికి పది లక్షల టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో ప్లాంటు ఏర్పాటు, మూడు వేల మందికి ఉపాధి కల్పించే ప్రాజెక్టుకు రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధి విధానం 4.0 కింద ప్రత్యేక ప్రోత్సాహకాలు కల్పించే ప్రతిపాదనకు ఆమోదం లభించింది. రెనైసాన్స్ సోలార్ అండ్ ఎలక్ట్రానిక్ మెటీరియల్స్ సంస్థకు 91.10 ఎకరాలు కేటాయించి, 3 వేల 700 కోట్ల పెట్టుబడితో 5 గిగావాట్ల సామర్థ్యం కలిగిన సమీకృత సిలికాన్ క్రిస్టల్, వేఫర్ తయారీ కేంద్రం ఏర్పాటు ప్రతిపాదనకు గ్రీన్ సిగ్నల్ వచ్చింది. రామ్‌కో సిమెంట్స్ వాణిజ్య ఉత్పత్తి ప్రారంభ గడువు సవరణ, అదనపు ప్రోత్సాహకాలు, తొమ్మిది సంస్థలకు ఎర్లీ బర్డ్ ఇన్సెంటివ్ పథకం కింద మూలధన రాయితీల మంజూరు వంటి ప్రతిపాదనలకు క్యాబినెట్ ఆమోదం లభించింది. శ్రీ సిమెంట్‌కు వైఎస్సార్ కడప జిల్లా జమ్మలమడుగు మండలం ఎస్.ఉప్పలపాడులో 452 ఎకరాలు, జై రాజ్ ఇస్పాత్‌కు కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం గుట్టపాడులో 418.55 ఎకరాలు కేటాయించే



ప్రతిపాదనలకూ ఒకే చెప్పారు. పెట్టుబడుల ప్రోత్సాహక మండలిలో తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా వివిధ పరిశ్రమలకు భూకేటాయింపులకు ఆమోదం తెలిపారు. నెల్లూరు జిల్లా మర్రిపాడు మండలం అల్లంపాడులో సన్‌సైన్ ఎనర్జిటిక్స్‌కు 455.91 ఎకరాలు, మునీష్ డిఫెన్స్ సొల్యూషన్స్‌కు దుత్తలూరు ప్రాంతంలో 250 ఎకరాలు, ఆదిత్య ప్రెసిటెక్‌కు 300 ఎకరాలు, జాక్సన్ సోలార్ ఇంటిగ్రేటెడ్‌కు కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం మీడివేములలో 290 ఎకరాలు ఇందులో ఉన్నాయి.

ఏపీఐఐసీకి బదిలీ ప్రతిపాదనకు గ్రీన్ సిగ్నల్

కర్నూలు జిల్లా ఓర్వకల్లులో రిలయన్స్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్ ప్యాకేజ్డ్ శీతల పానీయాలు, జ్యూస్‌లు, ప్యాకేజ్డ్ తాగునీటి తయారీ కేంద్రం ఏర్పాటు కోసం రూ.2,606 కోట్ల సవరించిన పెట్టుబడి ప్రతిపాదనకు ఆమోదం లభించిశీది. రక్షణ పరిశ్రమలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా ఏపీఐఐసీ ఆధ్వర్యంలో సామగ్రి, క్లస్టర్ భూముల కేటాయింపు నిబంధనలకు ఆమోదం దక్కింది. ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం వేదాద్రిలో 713.04 ఎకరాల ప్రభుత్వ భూమిని మార్కెట్ విలువ ఆధారంగా ఏపీఐఐసీకి బదిలీ చేసే ప్రతిపాదనకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.

ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ల రంగాల విస్తరణకు సంబంధించిన ప్రతిపాదనలకూ మంత్రివర్గం ఆమోదం లభించింది. అమరావతి క్వాంటమ్ వ్యాలీ పరిధిలో సుమారు 250 ఎకరాల్లో క్వాంటమ్ హార్డ్‌వేర్ తయారీ పార్కు ఏర్పాటు, అవసరమైన బడ్జెట్ సహకారం అందించే ప్రతిపాదనకు కూడా ఆమోదం లభించిశీది. వ్యవసాయ రంగానికి సంబంధించిన ప్రతిపాదనల్లో కృష్ణా జిల్లాలోని మెట్ట ప్రాంతాలకు సాగునీరు అందించే కోటపాడు లిఫ్ట్, చనుబండ, విస్సన్నపేట లిఫ్ట్ పథకాల పనుల కొనసాగింపునకు రూ.698.90 కోట్ల ప్రతిపాదనకు ఆమోదం తెలిపారు. అనంతపురం జిల్లాలోని ఉరవకొండ నియోజకవర్గంలో కమ్యూనిటీ లిఫ్ట్ కమ్ డ్రిప్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనుల కొనసాగింపునకు కూడా ఆమోదం లభించిశీది. విద్యుత్ ఉత్పత్తి సంస్థల ఆర్థిక అవసరాలకు సంబంధించిన ప్రతిపాదనలకూ మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

రాయలసీమ స్టీల్ సంస్థకు 2029 అక్టోబరు వరకు తాత్కాలిక, చార్జీ విధానంలో ఏటా 0.025 టీఎంసీల నీటిని కేటాయించే ప్రతిపాదనకు కూడా ఆమోదం దక్కింది. రోజుకు గరిష్ఠంగా 2,000 ఘనపు మీటర్ల నీటి అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నారు.

మరో బయోగ్యాస్ ప్లాంటు

రాష్ట్ర సమగ్ర స్వచ్ఛ ఇంధన విధానం--2024 కింద బయోగ్యాస్, పవన విద్యుత్, పవన--సౌర హైబ్రిడ్ ప్రాజెక్టులకు ప్రోత్సాహకాలు కల్పించే ప్రతిపాదనలకు క్యాబినెట్ లో ఆమోదం తెలిపారు. చిత్తూరు జిల్లా విజయపురం మండలం కలియంబాక్కంలో ఐరా బయోఎనర్జీ రోజుకు 12 టన్నుల సామర్థ్యంతో కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంటు ఏర్పాటు చేయనుంది. ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలం తాడువాయిలో ఆంధ్రా షుగర్స్ రోజుకు పది టన్నుల సామర్థ్యంతో మరో బయోగ్యాస్ ప్లాంటు ఏర్పాటు చేయనుంది. ఈ రెండు ప్రాజెక్టులకు విధానం ప్రకారం ప్రోత్సాహకాలు కల్పించే ప్రతిపాదనలకు ఆమోదం లభించింది.

కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలం కడివెల్లి, సమీప గ్రామాల్లో విండోరా ఎనర్జీకి 500 మెగావాట్ల పవన విద్యుత్ ప్రాజెక్టు కేటాయింపునకు ఆమోదం తెలిపారు. వివిధ జిల్లాల్లో పారిశ్రామిక పార్కులు, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల పార్కుల ఏర్పాటుకు ప్రభుత్వ భూములను ఏపీఐఐసీకి బదిలీ చేసే ప్రతిపాదనలకు ఆమోదం లభించిశీది. ప్రకాశం జిల్లా సింగరాయకొండ మండలం సోమరాజుపల్లిలో ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిని కొండపి నియోజకవర్గంలోని మత్స్యకార బాలికల కోసం శాశ్వత పాఠశాల భవనం, వసతి గృహం నిర్మించేందుకు ఉచితంగా కేటాయించే ప్రతిపాదనకు ఆమోదం తెలిపారు.

పర్యాటక, ఆతిథ్య రంగాల్లో పెట్టుబడులకు సంబంధించిన ప్రతిపాదనలకూ మంత్రివర్గం ఆమోదం తెలిపింది. కాకినాడలో లాలా ల్యాండ్ వాటర్ అండ్ అమ్యూజ్‌మెంట్ పార్కు అభివృద్ధికి మాన్ ప్రకృతి గ్రూప్స్‌కు ప్రోత్సాహకాలు కల్పించాలన్న రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సిఫారసులకు ఆమోదం లభించిశీది. అనంతపురంలో రాయల్ ఆర్కిడ్స్ బ్రాండ్ కింద ఫోర్‌స్టార్ హోటల్ ఏర్పాటు కోసం స్కై రిట్రీట్స్ సంస్థకు ప్రోత్సాహకాలు అందించే ప్రతిపాదనకూ ఆమోదం దక్కింది. 2026--27 ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌లో ధాన్యం సేకరణ కార్యకలాపాలకు సంబంధించి ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఆమోదించే అంశానికి మంత్రివర్గం ఆమోదం లభించింది. నీతి ఆయోగ్ 11వ పాలక మండలి సమావేశంలోని కార్యాచరణ నివేదికను మంత్రివర్గం పరిశీలించింది. అర్నబ్ తుపానుకు సంబంధించిన పరిస్థితులపై రియల్ టైమ్ గవర్నెన్స్ శాఖ రూపొందించిన నివేదికనూ సమావేశంలో చర్చించారు.

ప్రపంచ జూనియర్ సాఫ్ట్ టెన్నిస్‌లో వైశాలికి కాంస్య పతకం

విజయవాడ స్పోర్ట్స్, మహానగర్




చైనాలోని జింగ్‌షాన్‌లో అక్టోబర్ 26 నుంచి జరుగుతున్న ఐదో ప్రపంచ జూనియర్ సాఫ్ట్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్--2026లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన క్రీడాకారిణి ఏ.ఎస్. వైశాలి కాంస్య పతకం సాధించింది. బాలికల వ్యక్తిగత డబుల్స్ విభాగంలో విజయవాడకు చెందిన వైశాలి, తమిళనాడుకు చెందిన తనికా తాయుమానవన్‌తో కలిసి అద్భుత ప్రదర్శన చేసి పతకాన్ని సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) చైర్మన్ అనిమిని రవినాయుడు వైశాలిని అభినందించారు. అంతర్జాతీయ వేదికపై భారతదేశం తరపున పోటీపడి పతకం సాధించడం గర్వకారణమని పేర్కొన్నారు. క్రీడాకారిణులు ప్రదర్శించిన కృషి, పట్టుదల, అంకితభావం యువతకు, ముఖ్యంగా యువ క్రీడాకారిణులకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి దేశానికి, ఆంధ్రప్రదేశ్‌కు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఆంధ్రప్రదేశ్ సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ చైర్మన్ డా. డి. నవీన్ కుమార్, ప్రధాన కార్యదర్శి డి. దిలీప్ కుమార్, అధ్యక్షుడు వి. శ్రీనుబాబు, కోశాధికారి బి. నీరజతో పాటు వివిధ జిల్లాల సాఫ్ట్ టెన్నిస్ సంఘాల ప్రతినిధులు వైశాలికి అభినందనలు తెలిపారు.

తుపాను బాధితులకు అండగా నిలవండి

-మొదటిపేజీ తరువాయి

కనిపిస్తోంది. ప్రభుత్వం విపత్తులను ఆదాయ వనరుగా మార్చుకోవాలనుకుంటోంది' అని విమర్శించారు. సోనా మసూరి బియ్యం ధర కేజీ రూ.90 దాటిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వంలోని కీలక నేతలే బియ్యం ధరల పెరుగుదలకు కారణమని ఆరోపించారు. 'మంత్రి పయ్యావుల వియ్యంకుడు సహా టీడీపీ నేతలు బియ్యాన్ని మార్కెట్లోకి రానీయకుండా బ్లాక్ చేసి, ఎక్స్‌పోర్టు చేస్తున్నారు. విపత్కర పరిస్థితుల్లోనూ బియ్యం మాఫియాను ప్రోత్సహిస్తున్నారు' అని జగన్ వ్యాఖ్యానించారు. తుపాను కారణంగా వరి, ఆక్వా, పండ్ల తోటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని, ఈ క్లిష్ట సమయంలో బాధితులకు తోడుగా నిలవాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ధాన్యం సేకరణలో రైతులకు అండగా ఉంటూ, ప్రతి గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేసేలా ఒత్తిడి తీసుకురావాలని జగన్ స్పష్టం చేశారు.

రెబల్ అభ్యర్థులపై వెంటనే వేటు వేయండి



అమరావతి

ఎన్డీఏ కూటమి నిర్ణయాలకు వ్యతిరేకంగా పోటీ చేస్తున్న రెబల్ అభ్యర్థులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించినట్లు సమాచారం. పొత్తు ధర్మాన్ని ఎలాంటి పునరాలోచన లేకుండా పాటించాలని, కూటమి అభ్యర్థులకు వ్యతిరేకంగా బరిలో నిలిచిన వారిని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని ఆయన స్పష్టం చేసినట్లు తెలిసింది. రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఈ అంశంపై చర్చ జరిగినట్లు సమాచారం.

సీట్ల సర్దుబాటుపై చర్చ

ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. తాను, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ కలిసి చర్చలు జరిపి సీట్ల సర్దుబాటు ప్రక్రియను పూర్తి చేశామని పేర్కొన్నట్లు సమాచారం. ఈ నిర్ణయం ద్వారా ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు, నాయకులకు కూటమి ఐక్యతపై స్పష్టమైన సందేశం ఇచ్చామని వివరించినట్లు తెలిసింది. కూటమి తరపున పోటీ చేస్తున్న అభ్యర్థులకు మద్దతుగా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించినట్లు సమాచారం.

కూటమి అభ్యర్థులకే మద్దతు ఇవ్వాలి

ఓటర్లు వ్యక్తిగత అభ్యర్థులను మాత్రమే కాకుండా ఎన్డీఏ కూటమి నిర్ణయాన్ని పరిగణనలోకి తీసుకోవాలని చంద్రబాబు కోరినట్లు తెలిసింది. గత రెండున్నరేళ్లుగా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రజల నుంచి మద్దతు లభిస్తోందని ఆయన పేర్కొన్నట్లు సమాచారం. కూటమి భాగస్వామ్య పార్టీల మధ్య కుదిరిన అవగాహనకు అనుగుణంగా నాయకులు వ్యవహరించాలని, సీట్ల సర్దుబాటు నిర్ణయాలకు విరుద్ధంగా పోటీ చేయడం వల్ల రాజకీయ సమన్వయానికి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించినట్లు తెలిసింది.

సమన్వయానికి ప్రాధాన్యం

ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పందిస్తూ.. ముగ్గురు నేతలు కలిసి తీసుకున్న నిర్ణయంపై ప్రజలు, కార్యకర్తల నుంచి సానుకూల స్పందన వచ్చిందని తెలిపినట్లు సమాచారం. కూటమి భాగస్వామ్య పార్టీల నాయకులు పరస్పర సహకారంతో ముందుకు సాగాల్సిన అవసరాన్ని ఆయన ప్రస్తావించినట్లు తెలిసింది.

మంత్రులకు అదనపు బాధ్యతలు

మంత్రులు తమ నియోజకవర్గాలకే పరిమితం కాకుండా, తమకు కేటాయించిన జిల్లాల ఇన్‌ఛార్జి బాధ్యతలను కూడా సమర్థంగా నిర్వహించాలని చంద్రబాబు ఆదేశించినట్లు సమాచారం. ఎన్డీఏ అభ్యర్థుల విజయానికి సమన్వయంతో కృషి చేయాలని, కూటమి నేతల మధ్య తలెత్తే సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించాలని సూచించినట్లు తెలిసింది. ఎన్నికల సమయంలో స్థానిక నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం కీలకమని పేర్కొన్నట్లు సమాచారం.

స్థానిక ఎన్నికలకు ముందస్తు సన్నద్ధత

జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల అనంతరం పంచాయతీ, సహకార సంఘాల ఎన్నికలు జరిగే అవకాశం ఉన్నందున ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలని ముఖ్యమంత్రి సూచించినట్లు తెలిసింది. ఎన్నికలకు సంబంధించిన వివాదాలు లేదా సమస్యలు తలెత్తితే ఆలస్యం చేయకుండా వెంటనే పరిష్కరించాలని మంత్రులకు దిశానిర్దేశం చేసినట్లు సమాచారం. పార్టీ నిర్ణయాలను ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకునే విషయంలో ఉపేక్ష ఉండదని స్పష్టం చేసినట్లు తెలిసింది. కూటమి భాగస్వామ్య పార్టీల మధ్య కుదిరిన సీట్ల సర్దుబాటును అమలు చేయడం, రెబల్ అభ్యర్థుల అంశాన్ని పరిష్కరించడం, స్థానిక స్థాయిలో సమన్వయాన్ని పెంచడం వంటి అంశాలపై మంత్రివర్గ సమావేశంలో చర్చ జరిగినట్లు సమాచారం.

జిల్లా వ్యాప్తంగా పోలీసుల ఫ్లాగ్ మార్చ్‌లు







విజయవాడ క్రైమ్, మహానగర్

పోలీస్ కమిషనరేట్ పరిధిలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా నిర్వహించేందుకు పోలీసు యంత్రాంగం ముందస్తు చర్యలను ముమ్మరం చేసింది. పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖరబాబు ఆదేశాల మేరకు డీసీపీలు, ఏసీపీలు వివిధ ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాలు, పరిసర ప్రాంతాలను గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్ సరఫరా, ఓటర్లు సులభంగా చేరుకునే మార్గాలు, క్యూలైన్ల నిర్వహణ, దివ్యాంగులకు కల్పించాల్సిన సౌకర్యాలను తనిఖీ చేశారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అప్రమత్తంగా ఉండాలని, సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటూ ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని పోలీసు అధికారులకు కమిషనర్ సూచించారు. మరోవైపు, పోలీసు అధికారులు తమ సిబ్బందితో కలిసి వివిధ ప్రాంతాల్లో డ్రోన్లను వినియోగిస్తూ ఫ్లాగ్ మార్చ్‌లు నిర్వహించారు. ఓటర్లు ఎలాంటి భయం, ఒత్తిడి, ప్రలోభాలకు లోనుకాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఈ సందర్భంగా అధికారులు కోరారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ప్రతి ఒక్కరూ పాటిస్తూ ప్రశాంత ఎన్నికల నిర్వహణకు పోలీసు యంత్రాంగానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలకు రక్షణ కల్పించడం, ఓటర్లకు అవసరమైన సౌకర్యాలు అందించడం, ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించడమే తమ ప్రధాన లక్ష్యమని పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖరబాబు స్పష్టం చేశారు.

సరస్ సందడి.. మరో రెండు రోజులే!





సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి

జాతీయ సరస్ మేళాను సందర్శించండి

లఖ్‌పతి దీదీల ఉత్పత్తులను ప్రోత్సహించండి

జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

విజయవాడ, మహానగర్

నగరంలోని పున్నమి ఘాట్‌లో నిర్వహిస్తున్న జాతీయ సరస్ మేళా--2026 సందడి మరో రెండు రోజులు మాత్రమే కొనసాగనుందని, ఈ నెల 31వ తేదీతో మేళా ముగియనున్నందున ప్రజలు ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ కోరారు. అర్నబ్ తుపాను నేపథ్యంలో ఈ నెల 28న తాత్కాలికంగా మూతపడిన సరస్ గురువారం పునఃప్రారంభమైంది. దీంతో పెద్దఎత్తున సందర్శకులతో సరస్ ప్రాంగణం సరికొత్తగా కళకళలాడింది. జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ సరస్ మేళాకు వచ్చి వివిధ రాష్ట్రాల లఖ్‌పతిదీదీల స్టాళ్లను సందర్శించారు. వారితో మాట్లాడి సరస్ వేదిక కల్పించిన అవకాశం గురించి అడిగి తెలుసుకున్నారు. ఎంతమేర అమ్మకాలు జరిగాయో, సందర్శకుల నుంచి స్పందన ఎలా ఉందో తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ వివిధ రాష్ట్రాలకు చెందిన స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేసిన విభిన్న ఉత్పత్తులు, హస్తకళా వస్తువులు, సంప్రదాయ కళాకృతులు, గృహోపకరణాలు, వస్త్రాలు, ప్రాంతీయ ప్రత్యేకతలను చాటిచెప్పే ఉత్పత్తులతో సరస్ మేళా సందర్శకులను ఆకట్టుకుంటోందని తెలిపారు. స్వయం సహాయక సంఘాల నుంచి లఖ్‌పతి దీదీలుగా ఎదిగిన మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను కొనుగోలు చేయడం ద్వారా వారి కృషికి తగిన ప్రోత్సాహం అందించడంతోపాటు, గ్రామీణ మహిళా పారిశ్రామికవేత్తల ఆర్థిక స్వావలంబనకు ప్రజలు తోడ్పడాలని పిలుపునిచ్చారు. చివరి రెండు రోజులపాటు ప్రత్యేక ఆఫర్లు, ఆకర్షణీయమైన ఉత్పత్తులతో సందర్శకులకు వైవిధ్యభరితమైన కొనుగోలు అనుభూతిని అందిస్తున్న జాతీయ సరస్ మేళాను ప్రజలు పెద్ద సంఖ్యలో సందర్శించాలని విజ్ఞప్తి చేశారు. అలస్యం చేయకుండా సరస్ మేళాకు విచ్చేసి, నచ్చిన ఉత్పత్తులను కొనుగోలు చేయడంతోపాటు లఖ్‌పతి దీదీల విజయ ప్రస్థానంలో భాగస్వాములు కావాలని కలెక్టర్ లక్ష్మీశ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏపీ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) డైరెక్టర్ చక్రవర్తి, ఎన్‌టీఆర్ జిల్లా డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఏఎన్‌వీ నాంచారరావు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతలకు అండగా పంట నష్టాల నివారణకు చర్యలు

పొలాల్లో నిలిచిన నీటిని వెంటనే తొలగించాలి

శాస్త్రవేత్తల సూచనలపై రైతులకు అవగాహన కల్పించాలి

జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



విజయవాడ, మహానగర్

అర్నబ్ తుపాను ప్రభావంతో జిల్లాలో వ్యవసాయ రంగానికి ఎదురైన నష్టాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, రైతులకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పంటల పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించి, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, పంట నష్టాల అంచనాను వాస్తవ పరిస్థితుల ఆధారంగా చేపట్టాలని అధికారులకు సూచించారు. గురువారం కలెక్టర్ లక్ష్మీశ.. తిరువూరు మండలం, మల్లెల గ్రామంలో పర్యటించారు. గ్రామంలోని వరి పొలాలను సందర్శించి, గాలులకు నేలకొరిగిన వరి పంటను పరిశీలించారు. పంట ఏ దశలో ఉందో, ఎంత విస్తీర్ణంలో పైరు పడిపోయిందో, దిగుబడి, ధాన్యం నాణ్యతపై ఎలాంటి ప్రభావం పడే అవకాశం ఉందో వ్యవసాయ శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. పంట పొలాల్లో నిలిచిన మురుగునీటిని వెంటనే బయటకు తోడేలా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, రైతులకు అవసరమైన సాంకేతిక మార్గదర్శకత్వం అందించాలని తెలిపారు. పంట పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడటంతోపాటు, గింజలు మొలకెత్తకుండా, ధాన్యం నాణ్యత దెబ్బతినకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వరి పంట నేలకొరిగిన పరిస్థితుల్లో గింజలు మొలకెత్తడం, ధాన్యం రంగు మారడం, ఫంగల్ సంబంధిత సమస్యలు తలెత్తడం వంటి వాటిని తగ్గించేందుకు పంట పరిస్థితిని బట్టి తగిన నివారణ చర్యలు చేపట్టాలన్నారు. వీటిపై శాస్త్రవేత్తలు ఇచ్చే సూచనలను రైతులకు తెలియజేయాలన్నారు. రైతులకు ఎదురైన ఇబ్బందులను గుర్తించి, సంబంధిత శాఖల సమన్వయంతో అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో రైతులకు సరైన సమయంలో సాంకేతిక సూచనలు అందించడం, పంటలను సాధ్యమైనంతవరకు కాపాడుకునేలా మార్గనిర్దేశం చేయడం అత్యంత ముఖ్యమని కలెక్టర్ పేర్కొన్నారు. వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ రైతులకు అవసరమైన సహకారం అందించాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. కలెక్టర్ వెంట తిరువూరు ఆర్డీవో ఎ.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మొత్తం 86 డివిజన్లలో కూటమి విజయం ఖాయం

40 ఏళ్ల ఇళ్ల పట్టాల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాం

నగర అభివృద్ధికి రూ.1,850 కోట్లు తీసుకొస్తాం : ఎంపీ కేశినేని చిన్ని



విజయవాడ, మహానగర్

నగరంలోని 86 డివిజన్లలో కూటమి అభ్యర్థులు విజయం సాధిస్తారని, మేయర్ అభ్యర్థి వంగవీటి రాధాకృష్ణ భారీ మెజారిటీతో గెలవబోతున్నారని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ధీమా వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారిగా జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో కూటమి నాయకులతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ నిర్ణయాలకు వ్యతిరేకంగా రెబల్ అభ్యర్థులుగా పోటీలో కొనసాగితే సస్పెన్షన్ తప్పదని హెచ్చరించారు. విజయవాడలో 26 వేల మందికి ఇళ్ల పట్టాలు, రిజిస్ట్రేషన్ పత్రాలు అందించి నాలుగు దశాబ్దాలుగా పరిష్కారం కాని సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రజలకు యాజమాన్య హక్కులు కల్పించామని తెలిపారు. నగరంలో మంచినీటి సమస్య పరిష్కారంతో పాటు మౌలిక వసతుల అభివృద్ధికి సుమారు రూ.1,850 కోట్ల నిధులు తీసుకొస్తామని వెల్లడించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో కార్పొరేషన్‌పై రూ.400 కోట్ల బకాయిల భారం పడిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం విడతలవారీగా బకాయిలు చెల్లిస్తోందని, మిగిలిన మొత్తాన్ని కూడా చెల్లిస్తామని తెలిపారు. మేయర్ అభ్యర్థి వంగవీటి రాధాకృష్ణ మాట్లాడుతూ ప్రజల ఆశీర్వాదంతో మేయర్‌గా బాధ్యతలు చేపట్టి నగర అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. టీడీపీ నాయకులు బుద్దా వెంకన్న, గద్దె అనురాధ మాట్లాడుతూ విజయవాడలో కూటమి క్లీన్ స్వీప్ సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ ఎన్నికలను కూటమి రెండేళ్ల పాలనకు రెఫరెండంగా భావిస్తున్నామని పేర్కొన్నారు. బీజేపీ నాయకుడు షేక్ బాజీ మాట్లాడుతూ కేంద్ర నిధులతో విజయవాడలో అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. సమావేశంలో మక్కెన మల్లికార్జునరావు, అమ్మిశెట్టి వాసు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ మహిళా అభ్యర్థుల విస్తృత ప్రచారం



ఆగిరిపల్లి, మహానగర్

మండలంలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ మహిళా అభ్యర్థులు గురువారం విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎంపీటీసీ సెగ్మెంట్--2 పరిధిలోని హరిజనవాడలో జడ్పీటీసీ అభ్యర్థిని తులిమల్లి పావని జ్యోతి సుజన కుమారి, ఎంపీటీసీ అభ్యర్థిని చిమట అంజలీ దేవి ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధి, కమ్యూనిటీ హాల్ నిర్మాణం, శ్మశానవాటికకు వంతెన ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. తమను గెలిపిస్తే స్థానిక సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ చౌటపల్లి అంజయ్య, నక్కనబోయిన శ్రీమన్నారాయణ (పండు), సాధం గోపి, వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి, టౌన్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు తాళ్లూరి ఆదాం, బొబ్బర్ల సురేష్, టౌన్ అధ్యక్షుడు చిమట శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి జడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థులను గెలిపించాలని నాయకులు ఓటర్లను అభ్యర్థించారు.

మున్సిపల్ ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ

ఇబ్రహీంపట్నం, మహానగర్




పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ సన్నద్ధతలో భాగంగా గురువారం జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పలు కీలక కేంద్రాలను క్షేత్రస్థాయిలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఏర్పాట్లు సజావుగా జరుగుతున్నాయా లేదా అనే అంశాన్ని స్వయంగా పరిశీలించి, సంబంధిత అధికారులకు పలు కీలక సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ముందుగా కొండపల్లి మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్, అక్కడ ఏర్పాటు చేసిన బ్యాలెట్ పంపిణీ కేంద్రం, బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు కల్పించాలని, బ్యాలెట్ పత్రాల భద్రత విషయంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అనంతరం స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఓట్ల లెక్కింపు కేంద్రం, స్ట్రాంగ్ రూమ్‌లను కలెక్టర్ పరిశీలించారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పటిష్టమైన బందోబస్తు, సీసీ కెమెరాల నిఘా ఏర్పాట్లు, నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. కౌంటింగ్ రోజున ఏజెంట్లు, సిబ్బంది రాకపోకలకు సంబంధించి ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని అధికారులకు సూచించారు. డీఏవీ పబ్లిక్ స్కూల్‌లోని పోలింగ్ కేంద్రాలను సందర్శించిన కలెక్టర్, ఓటర్లకు అవసరమైన మౌలిక వసతులైన తాగునీరు, విద్యుత్, షామియానాలు, ర్యాంపుల ఏర్పాట్లను పరిశీలించారు. ఎన్నికల నిబంధనల ప్రకారం పోలింగ్ కేంద్రానికి 100 మీటర్ల దూరంలో తప్పనిసరిగా మార్కింగ్ చేయాలని, ఆ పరిధిలోకి అనధికార వ్యక్తులు రాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, అక్టోబర్ 30వ తేదీ లోపుగా మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి అన్ని పాలనాపరమైన, సాంకేతిక ఏర్పాట్లను నూరు శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో, నిష్పాక్షికంగా జరిగేలా చూడాలని పిలుపునిచ్చారు. ఈ పరిశీలన కార్యక్రమంలో కొండపల్లి మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాసులు, స్థానిక మున్సిపల్ అధికారులు, రెవెన్యూ యంత్రాంగం, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

మహానగర్

చదువుల వెనుక కార్పొరేట్ గ్రీడ్

ప్రాణం పోసే ఆసుపత్రి బాధ్యత మరిచిపోయి కార్పొరేట్ బిజినెస్ సెంటర్ గా మారిపోతే... మెడిసిన్స్ అమ్మాల్సిన మెడికల్ షాపు కసాయి దుకాణంగా రూపాంతరం చెందితే పరిస్థితి ఎంత ఘోరంగా ఉంటుందో చెప్పడానికి తాజాగా సుప్రీంకోర్టులో జరిగిన ఈ లీగల్ వార్ఫేరే ప్రత్యక్ష సాక్ష్యం. రూ. 11 వేల క్యాన్సర్ ఇంజెక్షన్ కోసం ఏకంగా రూ. 1,30,000 వసూలు చేయడం, రూ. 15 సెలైన్ డ్రిప్ లైన్ కోసం రూ. 250 పిండడం వంటి సంఘటనలు మన దేశంలోని కార్పొరేట్ హాస్పిటల్స్ చేస్తున్న రియల్ రోడ్‌సైడ్ రాబరీకి అద్దం పడుతున్నాయి. బాధితుడు స్వయంగా ఆ మందులు పంపిణీ చేసే డీలర్ అయి ఉండి, "సార్, నేనే ఈ మందులు సప్లై చేస్తాను, నన్ను కాపాడండి, నా దగ్గరున్న ఇంజెక్షనే వాడండి" అని కాళ్లావేళ్లా పడినా కరగని కార్పొరేట్ రాయి లాంటి మనస్తత్వాన్ని అత్యున్నత న్యాయస్థానం తీవ్రంగా ఎండగట్టింది. "ఇది సర్దుబాటు కాదు... పగటిదోపిడీ! దారిదోపిడీ" అంటూ జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాల ధర్మాసనం కేంద్ర ప్రభుత్వాన్ని, కార్పొరేట్ హాస్పిటల్ మాఫియాను కడిగేసింది.ఒక సామాన్యుడు లేదా మధ్యతరగతి పౌరుడు అత్యవసర సమయంలో ఆసుపత్రికి వెళ్తే చికిత్స కంటే ముందు బిల్లు చూసి హార్ట్ ఎటాక్ రావడం నేడు గ్యారెంటీగా మారింది. దీని వెనుక మెడిసిన్ చదివిన చదువుల వెనుక దాక్కున్న 'కార్పొరేట్ గ్రీడ్' స్పష్టంగా కనిపిస్తోంది. ఆసుపత్రిలో చేరిన భార్య కీమోథెరపీ కోసం ఆమె భర్త (స్వయంగా డ్రగ్ డిస్ట్రిబ్యూటర్) రూ. 11,000 ఖరీదు చేసే ఇంజెక్షన్‌ను ఆసుపత్రికి తెచ్చి తన వద్ద ఉన్నదే వాడాలని వేడుకున్నాడు. కానీ కార్పొరేట్ రూల్స్ పేరుతో దాన్ని తిరస్కరించిన యాజమాన్యం, తమ ఇన్‌హౌస్ ఫార్మసీ నుంచే దాన్ని కొనుగోలు చేయాలని నిర్బంధించి ఏకంగా రూ. 1,30,000 వసూలు చేసింది. అంటే కేవలం ఒక్క ఇంజెక్షన్‌పై ఏకంగా 1100% ప్రాఫిట్ మార్జిన్‌ను గుంజుకున్నారు. ఇక సెలైన్ ఐవీ సెట్, సిరంజీలు, కాటన్, సర్జికల్ గ్లౌజెస్, కాథెటర్స్ వంటి కన్స్యూమబుల్స్ విషయానికి వస్తే.. ఇవన్నీ హోల్‌సేల్ మార్కెట్‌లో కేవలం రూ. 10 నుంచి రూ. 15లకే లభిస్తాయి. కానీ కార్పొరేట్ ఆసుపత్రులు బాధితుడి పేషెంట్ ఫైల్‌లో వీటికి రూ. 200 నుంచి రూ. 350 వరకు బిల్లు వేస్తూ దోచుకుంటున్నాయి. తయారీ సంస్థ ఒక మందు లేదా సర్జికల్ ఐటమ్‌ను తయారు చేయడానికి అయ్యే ఖర్చు కేవలం రూ. 8 అయితే, దానికి ప్రింట్ చేసే ఎంఆర్‌పీ మాత్రం రూ. 100 లేదా రూ. 200 ఉంటుంది. హాస్పిటల్స్ ఈ ఎంఆర్‌పీ పక్కన బ్రాండ్ పేరు చూపిస్తూ, పేషెంట్ల నుంచి వందల రెట్లు ఎక్కువ డబ్బు గుంజుతున్నాయి.ఈ కేసు విచారణ సందర్భంలో కేంద్ర ప్రభుత్వం తరఫున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి "మేము ధరల విధానాన్ని నిరంతరం సర్దుబాటు చేస్తూనే ఉన్నాం" అని వాదించగా, ధర్మాసనం హై-వోల్టేజ్ ఆక్రోశాన్ని వ్యక్తపరిచింది. "మీ సర్దుబాటు పూర్తిగా దారి తప్పింది! రూ. 11 వేల నుంచి రూ. 1.30 లక్షలు కావడాన్ని సర్దుబాటు అనరు... దోపిడీ అంటారు! మనుషుల ప్రాణాలతో ఆడుకునేటప్పుడు ఇంత పెట్టుబడిదారీ ఆలోచన ఉండాలా? నిస్సహాయ స్థితిలో ఉన్న రోగులకు ఆసుపత్రుల దగ్గర బేరమాడే శక్త్యాయుధాలు ఉండవని మరచిపోవద్దు" అని మండిపడింది. ప్రభుత్వ డ్రగ్ ప్రైస్ కంట్రోల్ ఆర్డర్ కింద అత్యవసర మందుల జాబితా ఉన్నప్పటికీ, మార్కెట్లోని 90 శాతానికి పైగా నాన్-షెడ్యూల్డ్ మందులు, లైఫ్ సేవింగ్ క్యాన్సర్ డ్రగ్స్, మెడికల్ డివైజెస్ ఈ కంట్రోల్ పరిధికి పూర్తిగా బయటే ఉన్నాయి. ప్రభుత్వం ఇటీవల క్యాన్సర్ మందులపై ట్రేడ్ మార్జిన్‌ను 30 శాతానికి క్యాప్ చేసినట్లు చెబుతున్నా, అసలు నోటిపై చేయని రూట్లలో ఎంఆర్‌పీలను ఇష్టారాజ్యంగా ప్రింట్ చేసుకునే సడలింపులను కంపెనీలు వాడుకుంటున్నాయి. మూడు పార్లమెంటరీ కమిటీలు నివేదికలిచ్చినా.. తెర వెనుక ఉన్న కార్పొరేట్ సూత్రధారులకు ఆ రిపోర్టులు నచ్చడం లేదు కాబట్టే ప్రభుత్వం మౌనంగా ఉండిపోతోందని ధర్మాసనం ఘాటుగా విమర్శించింది.వివిధ నేషనల్ అండ్ ఇంటర్నేషనల్ థింక్-ట్యాంక్స్, సర్వేల ప్రకారం భారతదేశంలో హెల్త్‌కేర్ దారిదోపిడీ ఏ స్థాయిలో ఉందో గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి..ప్రైవేట్ ఆసుపత్రుల అసోసియేషన్ తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపిస్తూ, ప్రభుత్వ ఆసుపత్రులపై తీవ్ర ఒత్తిడి ఉంది కాబట్టే ప్రైవేట్ రంగం రాత్రింబవళ్లు సేవలు అందిస్తోందని, 24 గంటలూ సదుపాయాలు సిద్ధంగా ఉంచేందుకు కోట్ల రూపాయల నిర్వహణ ఖర్చు అవుతుందని చెప్పారు. మందుల మార్జిన్లు తగ్గించేస్తే ప్రైవేట్ ఆసుపత్రులు కుప్పకూలిపోతాయని, మార్కెట్లో సగం నకిలీ మందులు ఉన్నందున రోగులు బయటి నుంచి తెచ్చే మందులను తాము నమ్మలేమని వాదించారు. దీనిని సుప్రీంకోర్టు తీవ్రంగా తిప్పికొట్టింది. మీది కార్పొరేట్ హాస్పటల్... పడక రెంట్, డాక్టర్ ఫీజు, వెంటిలేటర్, ల్యాబ్ టెస్ట్‌లు... ప్రతిదానికీ వేర్వేరుగా ఛార్జీలు లాగుతున్నారు కదా... అలాంటప్పుడు మందులను 100%, 200%, 1000% రెట్లు ఎక్కువకు ఎందుకు అమ్మాలి? ప్రైవేట్ ఆసుపత్రి నడుపుతున్నామన్న కారణంతో ఈ ఎంఆర్‌పీని సమర్థించుకోలేరు. నిలదొక్కుకోవడానికి వేరే మార్గాలు చూసుకోండి కానీ, ప్రాణాలు కాపాడాల్సిన మందులపై ఈ దోపిడీ వద్దు... తయారీ సంస్థలు ఇచ్చే కార్పొరేట్ కట్-బాక్స్ డిస్కౌంట్ల గుట్టు ఇంకా బయటకు రాలేదు... అని తేల్చిచెప్పింది. ఆవిష్కరణల పేరుతో కంపెనీలు అధిక ధరలను సమర్థించుకోవడాన్ని తప్పుబడుతూ, గత 30 సంవత్సరాల్లో భారత ఫార్మా పరిశ్రమ సొంతంగా అభివృద్ధి చేసిన ఐదు కొత్త మాలిక్యూల్స్ పేర్లు చెప్పాలని ధర్మాసనం సవాల్ విసిరింది. అంటే విదేశీ పేటెంట్లను రీ-ప్యాకేజింగ్ చేసి, లాభాలు పిండుకోవడం తప్ప మన రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ శూన్యమని బట్టబయలు చేసింది.. ప్రధానమంత్రి జన్ ఔషధి కేంద్రాలు ఉన్నప్పటికీ, పెద్ద పెద్ద కార్పొరేట్ డాక్టర్లు జనరిక్ మందులు రాయకుండా, బ్రాండెడ్ ఫార్మా కంపెనీల స్పాన్సర్డ్ ట్రిప్స్ కోసం బ్రాండెడ్ మందులనే రాస్తూ పేషెంట్ల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు.న్యాయవాది కిషన్ చంద్ జైన్ దాఖలు చేసిన ఈ ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై విచారణ పూర్తి చేసిన సుప్రీంకోర్టు తీర్పును రిజర్వ్ చేసింది. నాన్-షెడ్యూల్డ్ మందులు, సర్జికల్ ఐటమ్స్, కన్స్యూమబుల్స్ ఉత్పత్తుల తయారీ ధరకు, రీటైల్ అమ్మకపు ధరకు మధ్య గరిష్టంగా 30% నుంచి 50% కంటే ఎక్కువ మార్జిన్ ఉండకుండా కేంద్ర ప్రభుత్వం చట్టబద్ధ నిబంధన తీసుకురావాలి. పేషెంట్లు క్వాలిటీ చెక్ కలిగిన సర్టిఫైడ్ బయటి ఫార్మసీల నుంచి మందులు తెచ్చుకునే వెసులుబాటును ప్రైవేట్ ఆసుపత్రులు నిరోధించకుండా కఠిన చట్టాలు చేయాలి. వైద్యులు తమ ప్రిస్క్రిప్షన్లలో కేవలం కెమికల్ మాలిక్యూల్ నామం మాత్రమే రాయాలి తప్ప, ఫార్మా కంపెనీల బ్రాండ్ పేర్లు రాయకూడదనే నిబంధనను కఠినంగా అమలు చేయాలి. వైద్యం అనేది లాభాలు పిండుకునే బిజినెస్ మోడల్ కాదు... అది రాజ్యాంగం కల్పించిన జీవించే హక్కు! ప్రాణాలను కాపాడాల్సిన ఆసుపత్రులే జేబులు గుల్ల చేసే కసాయి కొట్టులుగా మారితే, ఆ సమాజం వినాశనానికి దారితీస్తుంది. సుప్రీంకోర్టు ఇవ్వబోయే చారిత్రాత్మక తీర్పు భారతీయ హెల్త్‌కేర్ దోపిడీకి చెక్ పెడుతుందో లేదో వేచి చూడాలి!

బ్యాలెట్ ఎన్నికల్లో కాంగ్రెస్ జీరో



న్యూఢిల్లీ : నాలుగు ప్రధాన రాష్ట్రాల్లోని శాసనమండలి ఎన్నికల ఫలితాలు వెలువడిన వేళ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కాంగ్రెస్ పార్టీని లక్ష్యంగా చేసుకుని ట్విట్టర్ వేదికగా విసిరిన సెటైర్ వైరల్ అవుతోంది. ఈవీఎంలపై ఆరోపణలు చేస్తూ బ్యాలెట్ ఎన్నికలు కావాలంటున్న కాంగ్రెస్ కు తన ట్వీట్ తో మంట పుట్టించారు మోదీ. ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, బిహార్, కర్ణాటక వంటి నాలుగు పెద్ద రాష్ట్రాల్లో 28 ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. పైగా ఈ ఎన్నికలు బ్యాలెట్ పేపర్ల ద్వారానే జరిగాయి.. కాంగ్రెస్ పార్టీ ఎన్ని సీట్లు గెలుచుకుందో ఊహించండి? అంటూ ప్రధాని మోదీ సంధించిన ప్రశ్న నెట్టింట వైరల్ అవుతోంది. ఏ ఎన్నికల్లో ఓడిపోయినా ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల పై నెపం నెట్టేసే కాంగ్రెస్ పార్టీకి.. బ్యాలెట్ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా దక్కకపోవడాన్ని పరోక్షంగా ఎత్తిచూపుతూ మోదీ వేసిన సెటైర్ కాంగ్రెస్‌కు సూటిగా తగులుతోంది.ఎన్నికల ఫలితాల్లో ఎన్డీయే కూటమి తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శించగా, కాంగ్రెస్ పార్టీ పోటీ చేసిన నాలుగు రాష్ట్రాల్లో కలిపి ఒక్కటంటే ఒక్క స్థానాన్ని కూడా గెలుచుకోలేక పూర్తిగా జీరో వద్దే చతికిలపడింది. సొంతంగా అధికారంలో ఉన్న కర్ణాటకలోనూ కాంగ్రెస్‌కు పరాభవం తప్పలేదు. అక్కడ బీజేపీ-జేడీఎస్ కూటమి మెజార్టీ స్థానాలను కైవసం చేసుకుంది. ఇక ఉత్తరప్రదేశ్, బిహార్, మహారాష్ట్రల్లో బీజేపీ నేతృత్వంలోని కూటమి అభ్యర్థులు స్పష్టమైన ఆధిక్యతతో విజయఢంకా మోగించారు. విద్యావంతులు, పట్టభద్రులు, ఉపాధ్యాయ వర్గాలు ఓటర్లుగా ఉన్న ఈ స్థానాల్లో కాంగ్రెస్ కనీస పోటీ కూడా ఇవ్వలేకపోవడం ఆ పార్టీ కేడర్‌ను తీవ్ర నైరాశ్యంలోకి నెట్టింది.కాంగ్రెస్ పార్టీ , ఇండియా కూటమి పక్షాలు ఎన్నికల ఓటములను కప్పిపుచ్చుకునేందుకు ఈవీఎం ట్యాంపరింగ్ ఆరోపణలను ప్రధాన అస్త్రంగా వాడుతున్నాయి. దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని, ఈవీఎంలను తొలగించి మళ్లీ పాత పద్ధతి అయిన బ్యాలెట్ పేపర్లతోనే ఎన్నికలు నిర్వహించాలని రాహుల్ గాంధీ సహా కాంగ్రెస్ అగ్రనేతలు నిరంతరం ఉద్యమిస్తున్నారు. విపక్షాలు కోరుకున్నట్లుగానే బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించినా ప్రజలు కాంగ్రెస్‌ను తిరస్కరించారన్న నిజాన్ని ప్రధాని మోదీ తనదైన శైలిలో తేటతెల్లం చేశారు. ఓటమికి కారణం యంత్రాలు కాదని, కాంగ్రెస్ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలేనన్న స్పష్టమైన సంకేతాన్ని ఆయన ఈ చిన్న ట్వీట్‌తో దేశ ప్రజల ముందుంచారు.బ్యాలెట్ పేపర్లతో ఓటింగ్ జరిగినా ఖాతా తెరవలేకపోయిన కాంగ్రెస్.. ఇకపై దేనిని బూచిగా చూపిస్తుందో చెప్పాలంటూ బీజేపీ నేతలు తీవ్రస్థాయిలో ఎదురుదాడి ప్రారంభించారు. ప్రధాని మోదీ సంధించిన ఈ ఒక్క చురకతో అటు కాంగ్రెస్ నైతిక స్థైర్యం దెబ్బతినడమే కాకుండా, రాబోయే రోజుల్లో ఈవీఎంలపై రచ్చ చేసేందుకు విపక్షాలకు రాజకీయంగా నోరు మెదపలేని పరిస్థితి ఏర్పడింది.

కాంగ్రెస్‌కు సున్నా...

దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో జరిగిన శాసనమండలి సభ్యుల ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్ పార్టీకి నిరాశను మిగిల్చాయి. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో ఖాళీ అయిన 28 ఎమ్మెల్సీ స్థానాల్లో పోటీ చేసిన కాంగ్రెస్ ఒక్క స్థానాన్ని కూడా గెలుచుకోలేక బోణీ కొట్టకుండానే వెనుదిరిగింది. మరీ ముఖ్యంగా తమ సొంత పాలనలో ఉన్న కర్ణాటకలో సీటింగ్ ఎమ్మెల్సీ స్థానాన్ని సైతం కోల్పోవడం ఆ పార్టీకి మింగుడుపడని పరిణామంగా మారింది. అధికారం చేతిలో ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో ఓటమిని మూటగట్టుకోవడం హస్తం పార్టీ శ్రేణులను తీవ్రగ్గ్రాంతికి గురిచేసింది.ఈ ఎమ్మెల్సీ ఎన్నికలన్నీ బ్యాలెట్ పత్రాల ద్వారానే జరుగుతాయి. సాధారణంగా ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రత్యక్షంగా సమగ్ర ప్రజాతీర్పును ప్రతిబింబించనప్పటికీ, ప్రాంతీయంగా రాజకీయ సమీకరణాలు, అధికార పంపిణీ , పార్టీ సంస్థాగత బలాబలాలను అంచనా వేయడానికి స్పష్టమైన దిశానిర్దేశం చేస్తాయి. ఎమ్మెల్యేలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, పట్టభద్రులు ఓటర్లుగా ఉండే ఈ ఎన్నికల్లో 28కి ఒక్క సీటు కూడా సాధించలేకపోవడం కాంగ్రెస్ క్షేత్రస్థాయి మేనేజ్‌మెంట్ వైఫల్యాన్ని ఎత్తిచూపుతోంది. మిత్రపక్షాలతో సమన్వయం లోపించడం, ప్రత్యర్థుల వ్యూహాలను తిప్పికొట్టలేకపోవడమే ఈ ఘోర పరాభవానికి ప్రధాన కారణమం.పార్టీ అగ్రనాయకత్వం జాతీయ స్థాయి రాజకీయాలు, ర్యాలీలపైనే ఎక్కువ దృష్టి పెడుతూ క్షేత్రస్థాయిలోని నెట్‌వర్క్‌ను పూర్తిగా గాలికి వదిలేసిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బూత్ స్థాయి నుంచి స్థానిక సంస్థల వరకు బలమైన యంత్రాంగం లేకపోవడం వల్లనే ఇటువంటి ఎన్నికల్లో కాంగ్రెస్ తేలిపోతోంది. ప్రతిపక్షాల వ్యూహాత్మక ఓటింగ్, ఆకర్షణీయమైన అభ్యర్థుల ఎంపికతో ప్రత్యర్థులు పైచేయి సాధిస్తుంటే, కాంగ్రెస్ మాత్రం అంతర్గత విభేదాలు మరియు అనాలోచిత నిర్ణయాలతో మూల్యం చెల్లించుకుంటోంది. 28 స్థానాల్లో సున్నా ఫలితం రావడం అనేది కాంగ్రెస్ పార్టీ ఏమాత్రం ఉపేక్షించలేని తీవ్రమైన హెచ్చరిక. స్థానిక స్థాయిలో అధికార సమీకరణాలు మారడం ,పార్టీ యంత్రాంగం బలహీనపడటం కాంగ్రెస్ కుగడ్డు కాలం ఇంకాపోలేదని నిరూపిస్తున్నాయి. ఈ పరాభవం నుంచి వెంటనే పాఠాలు నేర్చుకుని, సంస్థాగత లోపాలను సరిదిద్దుకోకపోతే కాంగ్రెస్ భవిష్యత్తులో మరింత భారీ వెనుకబాటును ఎదుర్కోక తప్పదు. ఎప్పుడు చూసినా ఓటు చోరీ అంటూ వ్యవస్థలపై పోరాటం చేయడం తప్ప..ప్రజల తరపున పోరాటం చేయని కాంగ్రెస్ను ఇదిఇబ్బందికరమే.

యూపీలో టగ్ ఆఫ్ వార్...
కమలానికి డేంజర్ బెల్స్



ఉత్తరప్రదేశ్ శాసనమండలి ద్వైవార్షిక ఎన్నికల ఫలితాలు రాష్ట్ర రాజకీయాల్లో సరికొత్త ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. బీజేపీకి తిరుగులేని కంచుకోటలుగా భావించే పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గాల్లో ప్రధాన ప్రతిపక్షమైన సమాజ్‌వాదీ పార్టీ చొచ్చుకుపోయింది. మొత్తం 11 స్థానాలు 5 గ్రాడ్యుయేట్స్, 6 టీచర్స్ నియోజకవర్గాలకు జరిగిన ఎన్నికల్లో అధికార బీజేపీ 5 స్థానాలను గెలుచుకోగా, అఖిలేష్ యాదవ్ నేతృత్వంలోని ఎస్పీ 4 స్థానాల్లో జయకేతనం ఎగురవేసింది. కేవలం ఒక్క సీటు తేడాతో అధికార పార్టీ మెజార్టీని అడ్డుకోవడమే కాకుండా, విద్యావంతులు, ఉద్యోగుల వర్గాల్లో ప్రభుత్వ వ్యతిరేకత ఏ స్థాయిలో ఉందో ఈ ఫలితాల ద్వారా ఎస్పీ స్పష్టమైన రాజకీయ సందేశాన్ని పంపింది.ఈ ఫలితాల్లో అత్యంత విస్మయకరమైన అంశం ప్రధాని నరేంద్ర మోదీ లోక్‌సభ నియోజకవర్గమైన వారణాసి ఉపాధ్యాయ స్థానాన్ని ఎస్పీ కైవసం చేసుకోవడం. కాషాయ పార్టీకి కంచుకోట లాంటి వారణాసిలో బీజేపీ అభ్యర్థిని మట్టికరిపిస్తూ ఎస్పీ అభ్యర్థి లాల్ బిహారీ యాదవ్ సాధించిన విజయం లక్నో నుంచి ఢిల్లీ దాకా చర్చనీయాంశంగా మారింది. అంతేకాకుండా మేధావులు, విద్యావంతులకు కేంద్రమైన అలహాబాద్-ఝాన్సీ గ్రాడ్యుయేట్స్ స్థానంతో పాటు ఆగ్రా డివిజన్లలో సైతం సమాజ్‌వాదీ పార్టీ విజయదుందుభి మోగించింది. సీఎం యోగి ఆదిత్యనాథ్ ఇలాకా గోరఖ్‌పూర్, మీరట్ తదితర స్థానాల్లో బీజేపీ బయటపడినప్పటికీ.. గతంలో ఎన్నడూ లేని విధంగా పట్టభద్రుల స్థానాల్లో ఎస్పీ సాధించిన ఈ స్ట్రైక్ రేట్ కమలనాథులను ఆత్మరక్షణలోకి నెట్టింది.సాధారణంగా ఉపాధ్యాయ, పట్టభద్రుల స్థానాలంటే బీజేపీ, ఆరెస్సెస్ అనుబంధ సంఘాలకే మొదటి ప్రాధాన్యత ఉంటుందన్న సంప్రదాయానికి ఈ ఫలితాలు గండికొట్టాయి. నిరుద్యోగ సమస్య, పాత పెన్షన్ స్కీమ్ పునరుద్ధరణ డిమాండ్, కాంట్రాక్ట్ ఉపాధ్యాయుల సర్వీస్ క్రమబద్ధీకరణ వంటి క్షేత్రస్థాయి అంశాలను ఎస్పీ ఎన్నికల అస్త్రాలుగా మార్చుకోవడంలో పూర్తిస్థాయిలో సఫలీకృతమైంది. యువత, మధ్యతరగతి ఉద్యోగ వర్గాల్లో నెలకొన్న అసంతృప్తిని ఓట్ల రూపంలో మలచుకోవడంలో అఖిలేష్ యాదవ్ నెరిపిన సైలెంట్ ఆపరేషన్ తిరుగులేని ఫలితాన్ని ఇచ్చింది.కేవలం యాదవులు, మైనార్టీల ఓటు బ్యాంకు మాత్రమే కాకుండా.. విద్యావంతులు, పట్టభద్రులు, ఉపాధ్యాయ వర్గాల్లోనూ తమకు తిరుగులేని ఆమోదం లభిస్తోందని ఈ 4 ఎమ్మెల్సీ విజయాల ద్వారా ఎస్పీ నిరూపించుకుంది. రాబోయే ఎన్నికలకు ముందు విపక్ష శ్రేణుల్లో ఈ విజయం కొత్త ఊపును తీసుకురాగా, పట్టణ-విద్యావంతుల ఓటర్లను తిరిగి ప్రసన్నం చేసుకునేందుకు సరికొత్త వ్యూహాలు రచించాల్సిన అనివార్యతలోకి అధికార బీజేపీ వెళ్లిపోయింది

ఎరుపెక్కిన ఆకాశం

ఛత్తీస్‌గఢ్‌లోని పలు ప్రాంతాల్లో ఆకాశం అకస్మాత్తుగా రక్తవర్ణంలోకి మారడం తీవ్ర కలకలం రేపింది. దంతెవాడ, కిరండోల్ వంటి ప్రదేశాల్లో నింగి ఎర్రగా మారిన దృశ్యాలు ఇప్పుడు ఇంటర్నెట్‌లో వైరల్ అవుతున్నాయి. అర్నబ్ తుపాను కారణంగానే వాతావరణంలో ఈ వింత మార్పు చోటుచేసుకుందని స్థానికులు, నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. అయితే, ఆకాశం ఎర్రగా మారడానికి, తుపానుకు మధ్య ఉన్న సంబంధంపై అధికారికంగా ఎటువంటి ధ్రువీకరణ లేదు.తుపాను సమయంలో బలమైన గాలులు వీచినప్పుడు భారీ మొత్తంలో ధూళి, ఇసుక, ముఖ్యంగా ఇనుము అధికంగా ఉండే ఎర్రమట్టి గాలిలోకి లేస్తాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు. 'న్యూయార్క్ టైమ్స్' కథనం ప్రకారం.. ఈ ధూళి కణాలు వాతావరణంలోని పైపొరల్లోకి చేరడం వల్ల ఆకాశం అసాధారణంగా ఎర్రటి రంగులో కనిపిస్తుంది. అర్నబ్ తుపాను విషయంలోనూ ఇదే జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు. ఈ భయానక దృశ్యాలు సోషల్ మీడియాలో



సృజనాత్మక చర్చకు దారితీశాయి. ప్రముఖ నెట్‌ఫ్లిక్స్ సిరీస్ 'స్ట్రేంజర్ థింగ్స్'లోని 'అప్‌సైడ్ డౌన్' ప్రపంచాన్ని గుర్తుచేస్తోందని ఒక యూజర్ కామెంట్ చేయగా, 'వెక్‌నా వస్తున్నాడు' అంటూ మరో యూజర్ పోస్ట్ చేశారు. మరికొందరు దీన్ని 'ఈవిల్ డెడ్' సినిమా సెట్‌తో పోల్చారు. అయితే, కొందరు మాత్రం ఇది ప్రమాదకరమైన సంకేతం కావచ్చని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు.

ఇలాంటి ఘటనే ఈ ఏడాది మే నెలలో ఆస్ట్రేలియాలోనూ చోటుచేసుకుంది. 'నరెల్లే' తుపాను పశ్చిమ ఆస్ట్రేలియాలోని డెన్‌హామ్‌ను తాకినప్పుడు ఆకాశం ఇలాగే ఎర్రగా మారింది. అమెరికాకు చెందిన నేషనల్ ఓషియానిక్ అండ్ అట్మాస్ఫియరిక్ అడ్మినిస్ట్రేషన్ ప్రకారం, ఆస్ట్రేలియాలోని ఆ ప్రాంత నేలల్లో ఇనుము శాతం అధికంగా ఉంటుంది. తుపాను గాలుల వల్ల ఈ మట్టి గాలిలో కలిసి ఆక్సీకరణకు గురైనప్పుడు, ఆకాశం అంగారక గ్రహంలా ఎరుపు రంగులోకి కనిపిస్తుంది. కాగా, 'అత్యంత తీవ్రమైన తుపాను'గా భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వర్గీకరించిన అర్నబ్ తుపాను, అక్టోబర్ 28న గంటకు 130 కిలోమీటర్ల వేగంతో ఆంధ్రప్రదేశ్ తీరాన్ని దాటింది. దీని ప్రభావంతో భారీ వృక్షాలు నేలకూలాయి, పంటలు, ఇళ్లు నీట మునిగాయి. రవాణా, విద్యుత్ వ్యవస్థలకు తీవ్ర అంతరాయం కలగడంతో పాటు, మత్స్యకార కార్యకలాపాలు పూర్తిగా నిలిచిపోయాయి.

రబీ సాగుపై ఎల్‌నినో పంజా

వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావం దేశంలో వ్యవసాయ రంగంపై ఆందోళన పెంచుతున్నాయి. ఇప్పటికే ఖరీఫ్ (వర్షాకాలం) పంటల సీజన్‌ను అతలాకుతలం చేసిన ఎల్‌నినో ప్రభావం ఇప్పుడు రబీ (శీతాకాలం) పంటలపైనా తీవ్రంగా పడుతోంది. ఈ ఏడాది రుతుపవనాల సీజన్‌లో సాధారణం కంటే 13 శాతం తక్కువ వర్షపాతం నమోదు కావడంతో వాతావరణ సమతుల్యత పూర్తిగా దెబ్బతింది. దీని వల్ల పొలాల్లో తగినంత తేమ లేక రైతులు సాగు పనుల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నేలలో తేమ తగ్గడం సహా సాగునీటి లభ్యతపై ఆందోళనల కారణంగా గోధుమలు, శనగలు సహా పలు పంటల సాగు నెమ్మదించింది. ఈ ఎల్‌నినో- రబీ పంటల విత్తనాలు వేసే ప్రక్రియను తీవ్రంగా ప్రభావితం చేసింది. కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ తాజాగా విడుదల చేసిన నివేదిక ఈ ఆందోళనకరమైన పరిస్థితుల్ని కళ్లకు కట్టింది.

సగానికిపైగా పడిపోయిన గోధుమల సాగు

సాధారణంగా గోధుమల సాగు కాలం దేశంలో అక్టోబర్ నుంచి నవంబర్ వరకు ఉంటుంది. మార్చి- ఏప్రిల్ నాటికి కోతకు వస్తుంది. అయితే కేంద్ర వ్యవసాయ శాఖ రిపోర్ట్ ప్రకారం గత పంటల కాలం (2025-26) అక్టోబర్ 23వ తేదీ గణాంకాలతో పోలిస్తే, ప్రస్తుత పంటల సంవత్సరంలో (2026-27) గోధుమల సాగు విస్తీర్ణం ఏకంగా 59 శాతం క్షీణించింది. గతేడాది ఇదే సమయానికి దేశంలోని వివిధ రాష్ట్రాల్లో 27 వేల (0.27 లక్షలు) హెక్టార్లలో గోధుమ విత్తనాలు వేయగా, ఈసారి చూస్తే అది కేవలం 11 వేల (0.11 లక్షలు) హెక్టార్లకే పరిమితమైంది. గోధుమలతో పాటు



శనగలు, అన్ని రకాల పప్పుధాన్యాల సాగు విస్తీర్ణం కూడా భారీగా పడిపోయింది. గతేడాది అక్టోబర్ 23 నాటికి 3.77 లక్షల హెక్టార్లలో శనగలు సాగు చేయగా, ఈసారి 2.21 లక్షల హెక్టార్లకే పరిమితమైంది. పప్పుధాన్యాలు, నూనె గింజల సాగు తగ్గడం కూడా ఆహార సరఫరాపై ప్రభావం చూపొచ్చనే ఆందోళన వ్యక్తమవుతోంది.

రాజస్థాన్‌లోనే 58 శాతం తగ్గిన రబీ సాగు

రాజస్థాన్ రాష్ట్రంలో రబీ పంటల సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గింది. గోధుమలు, ఆవాలు, బార్లీ, శనగలు, కందులు, బఠానీలు వంటి పంటలు కలిగి గతేడాది ఇక్కడ అక్టోబర్ 23 నాటికి 14.13 లక్షల హెక్టార్లలో సాగు చేశారు. ఈ ఏడాది అదే తేదీ నాటికి చూస్తే 5.93 లక్షల హెక్టార్లలోనే సాగు జరిగింది. ఇక్కడ రికార్డు స్థాయిలో 8.21 లక్షల హెక్టార్ల మేర తగ్గుదల నమోదైంది. ఇది దాదాపు 58 శాతానికి సమానం. తమిళనాడులో కూడా రబీ సాగు విస్తీర్ణం సగానికి సగం తగ్గింది. యూపీలో స్వల్పంగా ప్రభావం కనిపిస్తోంది. మధ్యప్రదేశ్‌లో గతేడాది 0.20 లక్షల హెక్టార్లలో రబీ సాగు కాగా, ఈసారి అసలు నమోదు కాలేదు. ఉత్తరాఖండ్‌లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. కేరళంలో గతేడాది 0.14 లక్షల హెక్టార్లతో పోలిస్తే ఈసారి 0.11 లక్షల హెక్టార్లలో సాగు నమోదైంది. ఇలా దేశవ్యాప్తంగా 2026, అక్టోబర్ 23 వ తేదీ నాటికి చూస్తే రబీ పంటల మొత్తం సాగు విస్తీర్ణం 18.02 లక్షల హెక్టార్లుగా ఉంది. గతేడాది ఇదే తేదీ నాటికి ఇది ఏకంగా 28.26 లక్షల హెక్టార్లుగా ఉండటం గమనార్హం. ఎల్‌నినో కారణాలతో ఈసారి 10.24 లక్షల హెక్టార్ల వరకు తగ్గుదల నమోదైంది. ఈసారి శీతాకాలంలో వరి సాగు విస్తీర్ణం కూడా సగానికి సగం తగ్గింది. ఇదిలా ఉండగా, జొన్న, సజ్జ, రాగులు, ఇతర చిరుధాన్యాలు వంటి వాటి సాగు విస్తీర్ణం మాత్రం 13 వేల హెక్టార్ల నుంచి ఈసారి 23 వేల హెక్టార్లకు పెరగడం విశేషం. అయితే అన్ని రాష్ట్రాల్లో సాగు తగ్గలేదు. కర్ణాటకలో రబీ పంటల సాగు విస్తీర్ణం 1.80 లక్షల హెక్టార్ల నుంచి 1.91 లక్షల హెక్టార్లకు పెరిగింది. ఆంధ్రప్రదేశ్‌లో కూడా 0.23 లక్షల హెక్టార్లతో పోలిస్తే ఈసారి 0.37 లక్షల హెక్టార్లలో సాగు నమోదైంది. భారత వాతావరణ శాఖ గణాంకాల ప్రకారం దేశంలో రుతుపవనాల సీజన్‌లో జూన్- సెప్టెంబర్ మధ్య దేశంలో సాధారణం కంటే 13 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. పంజాబ్‌లో సాధారణం కంటే 38 శాతం, రాజస్థాన్‌లో 22 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. సెప్టెంబర్ చివరినాటికి ఈ రాష్ట్రాల్లోని జలాశయాల్లో నీటి నిల్వలు కూడా తక్కువగా ఉన్నాయి. దేశంలోని మొత్తం గోధుమ సాగు విస్తీర్ణంలో పంజాబ్, రాజస్థాన్ రాష్ట్రాల వాటానే 31 శాతంగా ఉండగా, ఈ రాష్ట్రాల్లోనే ఇప్పుడు ఎక్కువగా సాగు విస్తీర్ణం తగ్గడం ఆందోళన కలిగిస్తోంది.

పోలీసుల లాఠీలకు భయపడొద్దు

నవంబర్ 1న ఇండీ కూటమి తలపెట్టిన చలో దిల్లీ ర్యాలీలో ప్రతిఒక్కరూ పాల్గొనాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు. పోలీసులు, లాఠీలకు భయపడాల్సిన అవసరం లేదన్నారు. తమ కుతంత్రాలను ప్రయోగించే దమ్ము బీజేపీకి లేదన్నారు. రాజ్యాంగాన్ని రక్షించుకోవటానికి, దేశాన్ని కాపాడుకోవడానికి కలిసికట్టుగా నడుద్దామని రాహుల్ గాంధీ అన్నారు. ముఖ్యంగా రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా విద్యార్థి సంఘాలన్నీ ఈ మార్చ్‌లో పాల్గొనాలని కోరారు. ఇదో అద్భుతమైన మార్చ్ కాబోతుందని అన్నారు. ఇది కేవలం ఒక నిరసన మాత్రమే కాదని, ఈ దేశ ఆత్మ కోసం చేస్తున్న ప్రదర్శనగా రాహుల్ గాంధీ అభివర్ణించారు. "చలో దిల్లీ రాంలీలా మార్చ్, ఇది ప్రజాస్వామ్యాన్ని రక్షించడానికి, ఓటు చోరీని అరికట్టడానికి, రాజ్యాంగాన్ని రక్షించడానికి చేపట్టిన పాదయాత్ర. ఇది ఏ ఒక్క రాజకీయ పార్టీది కాదు, ఇది భారతదేశ ఆత్మ పాదయాత్ర. నరేంద్ర మోదీ, అమిత్ షా, జ్ఞానేష్ కుమార్‌లతో విసిగిపోయిన ప్రజలందరూ, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కోరుకునేవారు, రాజ్యాంగాన్ని రక్షించాలని కోరుకునే వారందరూ రావాలి. పోలీసులు, లాఠీల గురించి భయపడకండి. కుతంత్రాలను ప్రయోగించే దమ్ము బీజేపీకి లేదు. మాతో కవాతు చేయండి. రాజ్యాంగాన్ని, దేశాన్ని రక్షించడానికి మనం కలిసి నడుద్దాం. ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఇది దేశం కోసం జరుగుతున్న యాత్ర, ఇది మీ యాత్ర. మీరందరూ రండి మనమందరం కలిసి రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని



కాపాడుకుందాం. భారతదేశంపై దాడి జరుగుతోందని, భావ వ్యక్తీకరణపై, ఆలోచనలపై, దాడి జరుగుతోందని మీరు భావిస్తే రాజకీయలతో సంబంధం లేకుండా వచ్చి మాతో చేరండి. ఇది ఒక అద్భుతమైన యాత్ర కానుంది. ఇది మన దేశ ఆత్మను కాపాడేందుకు జరుగుతున్న యాత్ర."

ఖర్గే నివాసంలో ఇండీ కూటమి నేతల మీటింగ్

మరోవైపు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో 'ఇండీ' కూటమికి చెందిన ఎంపీలు సమావేశమయ్యారు. ఖర్గేతో పాటు ప్రియాంక గాంధీ, కేసీ వేణుగోపాల్, జైరాం రమేశ్?, గౌరవ్ గొగోయ్? సహా ఇతర పార్టీల నేతలు పాల్గొన్నారు. శుక్రవారం జరగబోయే 'మాక్ పార్లమెంట్'తో పాటు ర్యాలీ ఏర్పాట్లపై చర్చించారు. మాక్? పార్లమెంట్?లో ప్రధాన ఎన్నికల కమిషనర్ (జజుజ) జ్ఞానేష్ కుమార్‌పై ప్రతీకాత్మకంగా 'అభిశంసన' ప్రక్రియను చేపట్టాలని వారు భావిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని పార్లమెంటరీ కార్యకలాపాల తరహాలో నిర్వహించాలని ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. మొత్తం ప్రక్రియ ఒక పార్లమెంటు సమావేశంలా ఉంటుందని, ఇందులో అధికార, ప్రతిపక్షాలు ఉంటాయని పార్టీ వర్గాలు చెప్పాయి. సుమారు 40 మంది వక్తలు ఈ కార్యక్రమంలో పాల్గొనే అవకాశం ఉందని సమాచారం. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే ఈ కార్యక్రమంలో ప్రసంగించనున్నారు. మాజీ లోక్‌సభ స్పీకర్ మీరా కుమార్ ఈ సమావేశానికి అధ్యక్షత వహిస్తారు. ఈ 'మాక్ పార్లమెంట్' తర్వాత నవంబర్ 1న భారీ బహిరంగ సభ (ర్యాలీ) జరగనుంది.

అనేది దేశంలోని మెజారిటీ వర్గాల ప్రజల రాజ్యాంగబద్ధమైన ఓటు హక్కును లాక్కోవడానికి ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా పన్నిన ఒక 'కుట్ర' అని కాంగ్రెస్ ఆరోపించింది. ఈ కుట్రను ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ అమలు చేశారని విమర్శించింది. సీఈసీ జ్ఞానేశ్? కుమార్ పదవి నుంచి వైదొలగాలని, ఞ×=ను నిలిపివేయాలని, ఈసీఐనెట్ పోర్టల్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు కాంగ్రెస్ కమ్యూనికేషన్స్ ఇన్‌చార్జ్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ ఎక్స్? వేదికగా తెలిపారు. ఎస్ఐఆర్ పూర్తయిన లేదా కొనసాగుతున్న కనీసం ఆరు రాష్ట్రాల్లో, ఇప్పటివరకు గుర్తించిన అనుమానిత విదేశీయుల సంఖ్య సుమారుగా 1,600 మంది ఓటర్లతో పోలిస్తే చాలా తక్కువ అంటూ పేర్కొన్న మీడియా నివేదికను పోస్ట్ చేశారు.

బంగాళాఖాతంలో మరో అల్పపీడనం

'అర్నబ్' తుపాను సృష్టించిన విధ్వంసం నుంచి ఆంధ్రప్రదేశ్ కోస్తా తీరం ఇంకా కోలుకోకముందే మరో ముప్పు పొంచి ఉంది. బంగాళాఖాతంలో కొత్తగా ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారి రాష్ట్రం వైపు కదిలే అవకాశం ఉండటంతో తీర ప్రాంత ప్రజలు, రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించిన తాజా సమాచారం ప్రకారం, దక్షిణ అండమాన్ సముద్రం పరిసర ప్రాంతాల్లో ఒక అల్పపీడనం ఏర్పడింది. ఇది రానున్న 24 గంటల్లో పశ్చిమ-వాయవ్య దిశగా పయనిస్తూ తీవ్ర అల్పపీడనంగా బలపడనుంది. ఆ తర్వాత మరో 24 గంటల్లో ఆగ్నేయ బంగాళాఖాతంలో వాయుగుండంగా కేంద్రీకృతమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ వాతావరణ వ్యవస్థ మరింత బలపడి ఆంధ్రప్రదేశ్ తీరం వైపు పయనించే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. దీని ప్రభావంతో నవంబర్ 2, 3 తేదీల్లో ఉత్తర, దక్షిణ కోస్తాంధ్ర జిల్లాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఇప్పటికే 'అర్నబ్' తుపాను కారణంగా పంట నష్టం, ఆస్తి నష్టంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న కోస్తా జిల్లాల ప్రజలను ఈ కొత్త హెచ్చరిక మరింత ఆందోళనకు గురిచేస్తోంది. రానున్న రోజుల్లో దీని తీవ్రత, కదలికలపై మరింత స్పష్టత వస్తుందని అధికారులు పేర్కొన్నారు.



డిజిటల్ మోసాలకు బ్యాంకులే నష్టపరిహారం చెల్లించేలా జవాబుదారీగా చేయాలి

డిజిటల్ మోసాలు పెరుగుతున్న వేళ సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. డిజిటల్ మోసాల బాధితులకు నష్ట పరిహారం చెల్లించేలా బ్యాంకులను జవాబుదారీగా చేయాలని చెప్పింది. ఒకవేళ బ్యాంక్? తగిన శ్రద్ధ వహించడంలో విఫలమవడం వల్లే మోసం జరిగినట్లు రుజువైతే, డిజిటల్ అరెస్టుల వంటి నేరాల బాధితులకు వారు కోల్పోయిన మొత్తాన్నైనా నష్టపరిహారంగా అందించాలని ఆదేశించింది. బాధితులకు తగిన నష్టపరిహారం అందించేందుకు ప్రతిపాదిత నియంత్రణ చట్రం తప్పనిసరిగా నిబంధనలు కల్పించాలని ధర్మాసనం స్పష్టం చేసింది. డిజిటల్ అరెస్ట్ కుంభకోణం అంశంపై సుమోటోగా విచారణ జరిపిన సీజేఐ జస్టిస్? సూర్యకాంత్, జస్టిస్ జయమాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు వ్యాఖ్యానించింది. డిసెంబర్ 31 నాటికి అమల్లోకి రానున్న ఆర్‌బీఐ కేవైసీ సవరణ ఆదేశాలను పరిశీలిస్తామని సుప్రీంకోర్టు తెలిపింది. ప్రతిపాదిత మార్గదర్శకాల పరిధిలోకి వచ్చే ఆర్థిక సంస్థల వివరాలను, బాధితులకు నష్టపరిహారం అందించడానికి పరిశీలిస్తున్న చర్యలను తెలియజేయాలని ధర్మాసనం ఆర్‌బీఐని కోరింది. మోసపోతున్న వినియోగదారుల అసాధారణ లావాదేవీల గురించి సమీపంలోని పోలీస్ స్టేషన్లను అప్రమత్తం చేయడం బ్యాంకుల విధి అని తెలిపింది. ఖాతాదారుని నిర్ధరిత లావాదేవీల సరళికి భిన్నంగా ఉండే అసాధారణ లావాదేవీలను తాత్కాలికంగా నిలిపివేయడం, అనుమానాస్పద కార్యకలాపాలపై ఆటోమేటెడ్ రిపోర్టింగ్, లావాదేవీల ప్రామాణికతను నిర్ధరించడానికి భౌతిక ధ్రువీకరణ వంటి తప్పనిసరి నివారణ చర్యల అవసరాన్ని గుర్తు చేసింది. విచారణ సందర్భంగా కేంద్రం, ఇతర అధికారుల తరపున హాజరైన అటార్నీ జనరల్ ఆర్. వెంకటరమణి, గత ఏడాదితో పోలిస్తే నమోదైన డిజిటల్ అరెస్టు కేసులు సుమారు 50 శాతం తగ్గాయని కోర్టుకు తెలిపారు. కోర్టు జోక్యం, ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు, విభాగాల సమన్వయ చర్యలు, ప్రజా అవగాహన ప్రచారాల వల్లే ఈ తగ్గుదల సాధ్యమైందని ఆయన పేర్కొన్నారు.

'విద్యావంతులు డిజిటల్ మోసాలకు ఎలా బలి అవుతున్నారు'

మరోవైపు విద్యావంతులైన పౌరులు కూడా ఇలాంటి డిజిటల్ మోసాలకు ఎలా బలి అవుతున్నారంటూ సుప్రీం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ప్రజా చైతన్య కార్యక్రమాలు, వార్తా కథనాలు, కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ ప్రజలు ఇంకా మోసపోతుండటం పట్ల భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. "మేము ఆశ్చర్యపోతున్న విషయం ఏమిటంటే ప్రజలకు ఇంకా ఎందుకు అర్థం కావడం లేదు? బాధితులకు ఏమైంది? ఈ బాధితులు ఇలా ఎలా చిక్కుల్లో పడుతున్నారు? వారికి ఈ ప్రాథమిక విషయం అర్థం కావడం లేదా? మొబైల్‌లో అరెస్టు అవుతామనే భయం ఏమిటి? మీడియాలో దీని గురించి అంతగా ప్రచారం జరుగుతోంది కదా! ఒక ప్రజాస్వామ్య దేశంలో ఉంటూ మొబైల్ ఫోన్ ద్వారానే అరెస్టు చేస్తున్నారని ఎవరైనా ఎలా నమ్మగలరా?" అని అసహనం వ్యక్తం చేశారు. డిజిటల్ అరెస్టులను అరికట్టడానికి చాలా చర్యలు తీసుకుంటున్నప్పటికీ, ఈ సమస్య నిరంతరాయంగా కొనసాగుతోందని తనకు పదేపదే సమాచారం అందుతోందని ఈ కేసులో అమికస్ క్యూరీగా ఉన్న సీనియర్ న్యాయవాది ఎన్.ఎస్. నాప్పినై కోర్టుకు చెప్పారు. గత వారం ఇలాంటి ఘటనతో ఒక మహిళ రూ. 2.5 కోట్లు కోల్పోయిందని ఆమె కోర్టుకు తెలిపారు. "ఈ ప్రాథమిక విషయం వారికి అర్థం కావడం లేదా? మొబైల్ ద్వారా అరెస్టు అవుతామనే భయం ఏమిటి? మొబైల్‌ను గోడకు కొడితే అరెస్టు ఆగిపోతుంది. ప్రజలలో ఏదో లోపం ఉంది. అందులో ఏముందో దేవుడికే తెలియాలి. మిమ్మల్ని మీరే బాధితులుగా చేసుకుంటున్నారు. చదువుకున్న వారందరూ మోసపోతుండటం మాకు నిరాశ కలిగిస్తోంది. మీరే డిజిటల్ పద్ధతిలో అరెస్టు అయితే తర్వాతి తరానికి ఏమి అందిస్తారు? డిజిటల్ అరెస్ట్?పై ఏమైనా ఉత్తర్వులు ఉన్నాయేమో తెలుసుకోవడానికి ప్రజలు కోర్టు వెబ్‌సైట్‌కు కూడా వెళ్లవచ్చు." అని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ అన్నారు.

మార్చి నాటికి భారత్‌లో ఎండలతో 55 వేల మరణాల ముప్పు?

భారత్‌కు ఎల్‌నినో రూపంలో మరో వాతావరణ ముప్పు పొంచి ఉందా? రాబోయే నెలల్లో అసాధారణ ఉష్ణోగ్రతలు ప్రాణనష్టాన్ని పెంచే ప్రమాదం ఉందని తాజా పరిశోధన ఆధారిత అంచనాలు హెచ్చరిస్తున్నాయి. అమెరికాలోని షికాగో విశ్వవిద్యాలయానికి చెందిన 'క్లైమేట్ ఇంపాక్ట్ ల్యాబ్' రూపొందించిన కొత్త ట్రాకర్ ప్రకారం.. 2026 అక్టోబర్ నుంచి 2027 మార్చి వరకు భారత్‌లో అధిక వేడి కారణంగా సాధారణ స్థాయికి మించి సుమారు 55 వేల మరణాలు సంభవించే అవకాశం ఉంది. వీటిలో ఎక్కువ భాగం మార్చిలోనే నమోదయ్యే ప్రమాదం ఉందని అంచనా. ఇది వాతావరణ సమాచారం, ఉష్ణోగ్రతల అంచనాలు, గతంలో వేడికి సంబంధించిన మరణాల మధ్య ఉన్న సంబంధాల ఆధారంగా రూపొందించిన నమూనా అంచనా మాత్రమే. వాస్తవంగా ఎంతమంది మరణిస్తారో ఇది కచ్చితంగా చెప్పడం లేదు. ఎల్‌నినో అంటే పసిఫిక్ మహాసముద్రంలోని మధ్య, తూర్పు ప్రాంతాల్లో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరగడం. దీనివల్ల ప్రపంచవ్యాప్తంగా గాలుల దిశ, వర్షపాతం, ఉష్ణోగ్రతల్లో మార్పులు వస్తాయి. ఈసారి ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉండవచ్చని కొందరు నిపుణులు భావిస్తున్నారు. ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యూఎంఓ) కూడా ఈ ఏడాది ఎల్‌నినో బలంగా ఉందని, డిసెంబర్‌లో గరిష్ఠ స్థాయికి చేరే అవకాశం ఉందని హెచ్చరించింది. దీని ప్రభావాలు 2027 ప్రారంభం వరకు కొనసాగవచ్చని అంచనా. కొత్త ట్రాకర్ అంచనాల ప్రకారం.. అక్టోబర్ నుంచి వచ్చే ఏడాది మార్చి వరకు ప్రపంచవ్యాప్తంగా అధిక వేడి కారణంగా సాధారణ స్థాయికి మించి సుమారు 3.73 లక్షల మరణాలు సంభవించే అవకాశం ఉంది. ఈ ఆరు నెలల కాలంలో నైజీరియాలో 56 వేల మరణాలు, భారత్‌లో 55 వేల మరణాలు సంభవించవచ్చని అంచనా. ఇండోనేషియాలో 29 వేలు, బ్రెజిల్‌లో 19 వేల మరణాలు సంభవించే ప్రమాదం ఉందని ట్రాకర్ పేర్కొంది. అయితే ఈ అంచనాలు మరణాలు తప్పనిసరిగా జరుగుతాయని చెప్పడం లేదు. ముందస్తు హెచ్చరికలు, తాగునీటి సదుపాయాలు, చల్లదనం కల్పించే కేంద్రాలు, బయట పనిచేసే కార్మికులకు రక్షణ, ఆరోగ్య సేవలను మెరుగుపరచడం ద్వారా ప్రాణనష్టాన్ని తగ్గించవచ్చని పరిశోధకులు సూచిస్తున్నారు.

మహువా మొయిత్రా పిటిషన్ కొట్టివేత

దేశ ఆర్థిక మార్కెట్లలో పెట్టుబడులకు సంబంధించి సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్స్, ఫారిన్ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల పోర్ట్‌ఫోలియోలు, వాటి అసలు లబ్ధిదారుల వివరాలను బహిర్గతం చేయాలని సెబీని ఆదేశించలేమని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ మేరకు ఎవీజ ఎంపీ మహువా మొయిత్రా దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ ఆర్.మహదేవన్, జస్టిస్ డి.కె.ఉపాధ్యాయలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం కొట్టివేసింది. ఒక ఎంపీగా ఈ అంశాన్ని పార్లమెంటులో ఎందుకు లేవనెత్తలేదని, అక్కడ ఎందుకు చర్చ కోరలేదని ధర్మాసనం ప్రశ్నించింది. పెట్టుబడిదారుల వివరాలను బహిర్గతం చేయటానికి ప్రస్తుతం చట్టపరమైన వ్యవస్థ కానీ ఫ్రేమ్‌వర్క్ లేదని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. ఇందుకోసం కోర్టు ఒక కొత్త నియంత్రణ ఫ్రేమ్‌వర్క్‌ను సృష్టించాల్సి ఉంటుందని, రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 కింద తనకు ఉన్న అధికార పరిధిని ఉపయోగించి కోర్టు అలాంటి పనిని చేయలేదని చెప్పింది. అయినా సెబీకి ఆదేశాలు ఇవ్వొచ్చని పిటిషనర్ తరఫు న్యాయవాదులు తెలిపారు. ఈ ఫండ్స్ వెనక ఉన్న అసలు వ్యక్తులు కంపెనీల షేర్ల విలువను అమాంతం పెంచి అమాయక పెట్టుబడిదారులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. అందువల్ల అసలు లబ్ధిదారుల వివరాలు వెల్లడించేలా ఆదేశించాలని కోరారు. కంపెనీల్లో జరుగుతున్న భారీ పెట్టుబడుల వెనుక ఎవరున్నారో తెలుసుకునే హక్కు సాధారణ పెట్టుబడిదారులకు ఉండాలని అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా విదేశీ సంస్థల ద్వారా అస్పష్టమైన మార్గాల్లో పెట్టుబడులు వచ్చినప్పుడు ఇది మరింత ముఖ్యమని పిటిషనర్ తరఫు న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదించారు. అపారదర్శక ఆర్థిక సాధనాల ద్వారా స్టాక్ మార్కెట్‌ను తారుమారు చేసే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సెబీ అనేది సెక్యూరిటీ మార్కెట్లను నియంత్రించే సంస్థ అని, ఏఐఎఫ్, ఎఫ్‌పీఐల కార్యకలాపాలను పర్యవేక్షించడం దాని బాధ్యత అని పేర్కొన్నారు. అయితే, ప్రజా ప్రయోజనాల దృష్ట్యా అంతిమ లబ్ధిదారుల వివరాలను వెల్లడించడం అవసరమని కోర్టు భావిస్తే, మార్కెట్‌లోని పెట్టుబడుల వెనుక ఎవరున్నారో పౌరులు తెలుసుకునేందుకు వీలుగా ఆదేశించవచ్చని భూషణ్ కోర్టుకు చెప్పారు. ఈ సమస్య కేవలం సెబీ వద్ద సమాచారం ఉండటం లేదా లేకపోవడానికి సంబంధించినది మాత్రమే కాదన్నారు. షేర్లను ఎవరు కొనుగోలు చేస్తున్నారు, విక్రయిస్తున్నారు? ఆ పెట్టుబడుల వల్ల అంతిమంగా ఎవరు లబ్ధి పొందుతున్నారు

తుఫాను ప్రభావంతో దెబ్బతిన్న పంటలను పరిశీలించిన విక్కుర్తి

అవనిగడ్డ, మహానగర్



ఆర్నబ్ తుఫాన్ ప్రభావంతో వీచిన బలమైన ఈదురుగాలులు, కురిసిన భారీ వర్షాలకు మోపిదేవి మండలంలోని బొబ్బర్లంక, కొక్కిలిగడ్డ కొత్తపాలెం గ్రామాల్లో వందలాది ఎకరాల్లో అరటి తోటలు దెబ్బతిన్నాయి. పసుపు, కంద తదితర వాణిజ్య పంటలకు కూడా నష్టం వాటిల్లింది. ఈ నేపథ్యంలో గురువారం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ విక్కుర్తి శ్రీనివాసరావు స్థానిక టీడీపీ నాయకులు, రైతులతో కలిసి ఆయా గ్రామాల్లో పర్యటించి దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. తుఫాన్ ప్రభావంతో నేలకొరిగిన అరటి చెట్లు, దెబ్బతిన్న అరటి గెలలు, పసుపు, కంద తదితర పంటల పరిస్థితిని ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పంటలకు జరిగిన నష్టం గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. సాగు కోసం పెట్టుబడులు పెట్టి, పంట చేతికొచ్చే సమయంలో ప్రకృతి వైపరీత్యం కారణంగా నష్టపోవాల్సి రావడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా అరటి సాగుపై ఆధారపడిన రైతులకు వందలాది అరటి తోటలు దెబ్బతినడం వల్ల భారీ నష్టం వాటిల్లే పరిస్థితి ఏర్పడిందని అరటి సాగు కోసం రైతులు చేసిన పెట్టుబడులు, ఎరువులు, పురుగుమందులు, ఇతర వ్యవసాయ ఖర్చులు వృథా అయ్యే పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.మరోవైపు పసుపు, కంద వంటి వాణిజ్య పంటలు దెబ్బతినడంతో రైతులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా విక్కుర్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ, ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని తెలిపారు . సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పర్యటించి, దెబ్బతిన్న అరటి తోటలు, పసుపు, కంద తదితర పంటలను పరిశీలించి నష్టాన్ని సమగ్రంగా అంచనా వేయాలని సూచించారు. పంట నష్టానికి సంబంధించిన వివరాలను పారదర్శకంగా నమోదు చేసి, ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులైన రైతులకు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.రైతులకు అండగా నిలవాల్సిన అవసరం ఉందని, తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతుల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.ఈ పర్యటనలో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులకు ప్రభుత్వ సాయం
- ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

మోపిదేవి, మహానగర్



ఆర్ణబ్ తుఫానుకు పంటనష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. మండల పరిధిలోని కోసూరువారిపాలెంలో దెబ్బతిన్న అరటి తోటలను గురువారం ఆయన పరిశీలించారు. ఉద్యానవన శాఖ సిబ్బంది పంట నష్టం ప్రాథమిక అంచనాలు ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుఫాన్ కారణంగా నియోజకవర్గంలో అరటి, టమాటా, బొప్పాయి తోటలతో పాటు వివిధ దశల్లో ఉన్న వరిపైరుకు కలిగిన నష్టాన్ని ప్రభుత్వం అంచనా వేయిస్తోందన్నారు. రైతులకు పంట నష్ట పరిహారంపై ఇప్పటికే సీఎం చంద్రబాబు ప్రకటన జారీ చేశారని తెలిపారు. రైతులు అధైర్యపడవద్దని, ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని భరోసానిచ్చారు. తుఫాన్ గాలులకు నియోజకవర్గంలో వంద విద్యుత్ స్తంభాలు పడిపోయినట్లు తెలిపారు. ఇప్పటికే 90 శాతం పైగా విద్యుత్ సరఫరా పునరుద్ధరించామని, ఇంకా ఏటిమొగ, ఎదురుమొండికి సాధ్యమైనంత వేగంగా పునరుద్ధరిస్తామని తెలిపారు. రైతాంగ నియోజకవర్గమైన అవనిగడ్డ నియోజకవర్గంపై ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రత్యేకత శ్రద్ధ చూపుతున్నారని తెలిపారు. నష్టపోయిన రైతులకు అన్ని విధాలుగా అండగా నిలిచి ఆదుకుంటామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నూతన ప్రాజెక్టుల కంటే ముందు అన్ని పంట కాలువలు, మురుగు కాలువలు ప్రతి ఏటా క్రమం తప్పకుండా పూడిక తీయించాలని కోరారు. నియోజకవర్గంలో కోడూరు, నాగాయలంక మండలాల్లో కీలకమైన ఔట్ ఫాల్ స్లూయిజుల పునర్నిర్మాణానికి ప్రత్యేక శ్రద్ధతో నిధులు మంజూరు చేసిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లకు కృతజ్ఞతలు తెలిపారు. దింతోపాటు పులిగడ్డ నుంచి విజయవాడ వరకు కరకట్ట రోడ్డు అభివృద్ధికి నిధులు మంజూరు చేయటం పట్ల సీఎం, డిప్యూటీ సీఎంలకు ధన్యవాదములు తెలిపారు. సముద్రపు కరకట్ట అభివృద్ధికి కూడా డిజాస్టర్ మేనేజ్ మెంట్ నిధుల నుంచి నిధులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో జనసేన నాయకులు పాల్గొన్నారు.

జోగరాజుకు మద్దతుగా ఆరే శ్యామల ఎన్నికల ప్రచారం





విజయవాడ, మహానగర్

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్ అభ్యర్థి జోగరాజుకు మద్దతుగా ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆరే శ్యామల గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. 30వ డివిజన్ పరిధిలోని కోతమిషన్ రోడ్డు, గంగానమ్మ గుడి రోడ్డు, వైఎస్సార్ విగ్రహం రోడ్డు తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకుంటూ ఆటో గుర్తుపై ఓటు వేసి జోగరాజును గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తాటిపర్తి కొండారెడ్డి, కార్పొరేటర్ అభ్యర్థి జోగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఈవీలకు అదనపు బీమా రక్షణ అవసరం

విజయవాడ, మహానగర్:

దేశంలో ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) వినియోగం వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో వాటికి ప్రత్యేకమైన బీమా రక్షణపై అవగాహన పెంచుకోవాలని టాటా ఏఐజీ జనరల్ ఇన్సూరెన్స్ సూచించింది. వాహన్ రిజిస్ట్రేషన్ గణాంకాల ప్రకారం 2026 జనవరి నుంచి సెప్టెంబర్ వరకు భారత్‌లో 25.37 లక్షల ఈవీలు రిజిస్టర్ అయ్యాయి. గతేడాది ఇదే కాలంలో నమోదైన 16.70 లక్షలతో పోలిస్తే 51.9 శాతం వృద్ధి నమోదైంది. మొత్తం కొత్త వాహన రిజిస్ట్రేషన్లలో ఈవీల వాటా 10.7 శాతానికి చేరింది. సంప్రదాయ వాహనాలతో పోలిస్తే ఈవీల్లో బ్యాటరీ దెబ్బతినడం, ప్రత్యేక మరమ్మతులు, ఛార్జింగ్ సమయంలో ప్రమాదాలు వంటి భిన్నమైన రిస్కులు ఉంటాయని టాటా ఏఐజీ మోటార్ అండర్‌రైటింగ్ హెడ్ ఎ. కిరణ్ కుమార్ తెలిపారు. వాహన యజమానులు బ్యాటరీ నష్టాల కవరేజీ, ఛార్జింగ్ పరికరాల రక్షణ, ఎలక్ట్రిక్ సర్జ్ సెక్యూర్, వాల్ ఛార్జర్ ప్రొటెక్షన్ వంటి అదనపు బీమా సదుపాయాలను పరిశీలించాలని సూచించారు. పాలసీ మినహాయింపులు, డిడక్టబుల్స్, క్లెయిమ్ నిబంధనలను అర్థం చేసుకోవాలని పేర్కొన్నారు. వాణిజ్య ఈవీలకు కూడా తగిన బీమా రక్షణ అవసరమని స్పష్టం చేశారు.

స్ట్రోక్ నివారణలో పొగాకు నియంత్రణ కీలకం

విజయవాడ, మహానగర్

భారతదేశంలో పక్షవాతం, గుండె సంబంధిత వ్యాధుల ముప్పును తగ్గించేందుకు పొగాకు వినియోగ నియంత్రణపై మరింత సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని వైద్య నిపుణులు సూచించారు. ప్రపంచ పక్షవాత దినోత్సవం సందర్భంగా పొగాకు వ్యసనాన్ని ఎదుర్కోవడంతో పాటు, ధూమపానం మానేందుకు నిరంతర వైద్య సహకారం అందించాలని పిలుపునిచ్చారు. గ్లోబల్ బర్డెన్ ఆఫ్ డిసీజ్ 2024 డేటా విశ్లేషణ ప్రకారం, భారత్‌లో పక్షవాత మరణాల్లో 12 శాతం పొగాకు వినియోగంతో ముడిపడి ఉండగా, అధిక సిస్టోలిక్ రక్తపోటు 56 శాతం మరణాలకు కారణమవుతోంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనాల ప్రకారం, దేశంలో పొగాకు వినియోగం కారణంగా ఏటా సుమారు 13.5 లక్షల మంది మరణిస్తున్నారు. సిగరెట్లు, బీడీలతో పాటు ఖైనీ, గుట్కా, జర్దా వంటి ఉత్పత్తుల వినియోగాన్ని తగ్గించేందుకు విస్తృత వ్యూహాలు అవసరమని నిపుణులు పేర్కొన్నారు. నికోటిన్ రీప్లేస్‌మెంట్ థెరపీ వంటి వైద్యపరంగా నిరూపితమైన పద్ధతులతో పొగాకు మానేందుకు సహకరించాలని సూచించారు. యువత పొగాకు అలవాటుకు దూరంగా ఉండేలా అవగాహన, నివారణ చర్యలను బలోపేతం చేయాలని తెలిపారు. అధిక రక్తపోటు నియంత్రణతో పాటు శాస్త్రీయ ఆధారాలతో కూడిన ప్రజారోగ్య విధానాలు పక్షవాతం, గుండె జబ్బుల ముప్పును తగ్గించడంలో కీలకమని స్పష్టం చేశారు.

వైసీపీ అభ్యర్థులను గెలిపించండి
- మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు



అవనిగడ్డ, మహానగర్

స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారంలో భాగంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, మాజీ ఉప ప్రధాని బాబు జగజ్జీవన్ రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం, స్థానిక ఆరో సెగ్మెంట్‌లో జడ్పీటీసీ అభ్యర్థి చింతలపూడి శ్రీలక్ష్మి, ఎంపీటీసీ అభ్యర్థి గాజుల జై గోపాల్‌తో కలిసి మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి గత ప్రభుత్వంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, ప్రస్తుత కూటమి ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ వైసీపీ అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ సందర్భంగా రమేష్ బాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం గతంలో ఈవీఎంల ద్వారా మోసాలకు పాల్పడినట్లుగా, ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కుట్రలు, తంత్రాలతో గెలవాలని చూస్తోందని ఆరోపించారు. ఓట్లను ఒకచోట నుంచి మరోచోటకు తారుమారు చేసి ఎలాగైనా గెలవాలని ప్రయత్నిస్తోందని విమర్శించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిత్యావసర సరుకుల ధరలు, ప్రస్తుత కూటమి ప్రభుత్వ హయాంలో ధరలను ప్రజలు గమనించాలని అన్నారు. కూటమి ప్రభుత్వంలో ఆర్థికంగా సంపన్నులకే ప్రయోజనం చేకూరుతోందని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో పేదలు, అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగిందని ఆయన పేర్కొన్నారు.

జోరుగా కూటమి అభ్యర్థుల ఎన్నికల ప్రచారం
ఎంపీటీసీ అభ్యర్థులతో కలిసి విస్తృత ప్రచారం చేసిన టీడీపీ జడ్పీటీసీ అభ్యర్థి రావెళ్ల ఉదయ్ కుమార్



చల్లపల్లి, మహానగర్

స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. మండలంలో బీజేపీ, జనసేన పార్టీలు బలపరిచిన తెలుగుదేశం పార్టీ జడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థులు ఎన్నికల ప్రచారం చేశారు. మండల పరిధిలోని నిమ్మగడ్డ, యార్లగడ్డ, నడకుదురు, వెలువోలు, నాదెళ్లవారిపాలెం, రాముడుపాలెం గ్రామాల్లో కూటమి బలపరిచిన జడ్పీటీసీ అభ్యర్థి రావెళ్ల ఉదయ్ కుమార్, ఎంపీటీసీ అభ్యర్థులు పడమట శ్రీరావమ్మ, నలిగిలి లక్ష్మి నిర్మల, మాతంగి రత్నకుమారి ఓట్లను అభ్యర్థించారు. తమను గెలిపిస్తే గ్రామాల్లో మౌళిక సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి విస్తృత ప్రాధాన్యత ఇచ్చి ప్రతి పల్లెను అభివృద్ధి చేస్తోందని, తమను గెలిపిస్తే జిల్లా పరిషత్, మండల పరిషత్ నిధులతో మరిన్ని అభివృద్ధి పనులు చేసి ప్రజలకు సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ప్రచారంలో భాగంగా ఆయా గ్రామాల్లో మహిళలు ఉదయ్ కుమార్ కు హారతులతో అపూర్వ స్వాగతం పలికారు. పలు దేవాలయాల్లో అభ్యర్థులు, నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.రు.

5.9 లీటర్ల ఇన్‌స్టంట్ వాటర్ హీటర్లతో క్రాంప్టన్ పోర్ట్‌ఫోలియో విస్తరణ

విజయవాడ, మహానగర్



గృహ అవసరాలకు వేగంగా వేడినీటిని అందించడంతోపాటు భద్రత, మన్నిక, సౌకర్యానికి ప్రాధాన్యమిస్తూ క్రాంప్టన్ సంస్థ 5.9 లీటర్ల ఇన్‌స్టంట్ వాటర్ హీటర్ల శ్రేణిని మార్కెట్లోకి విడుదల చేసింది. ఈ కొత్త శ్రేణిలో శక్తివంతమైన 3 కిలోవాట్ల హీటింగ్ ఎలిమెంట్, అత్యాధునిక నాలుగు అంచెల భద్రతా వ్యవస్థను అందుబాటులోకి తెచ్చింది. కఠిన జలాల వల్ల ఏర్పడే ఖనిజ నిక్షేపాల నుంచి హీటింగ్ ఎలిమెంట్‌ను రక్షించేందుకు రూపొందించిన యాంటీ స్కేల్ సాంకేతికత 1000 పీపీఎం వరకు కఠిన జల పరిస్థితులను తట్టుకునేందుకు తోడ్పడుతుంది. సాధారణ హీటర్లతో పోలిస్తే సుమారు 40 శాతం వేగంగా నీటిని వేడి చేసే సామర్థ్యం, 6.5 బార్ నీటి పీడనాన్ని తట్టుకునే నిర్మాణం ఈ శ్రేణి ప్రత్యేకతలుగా సంస్థ పేర్కొంది. ఆటో థర్మోస్టాట్, థర్మల్ కట్‌అవుట్, ప్రెజర్ సేఫ్టీ వాల్వ్‌తో కూడిన భద్రతా వ్యవస్థతో పాటు ఫుడ్‌గ్రేడ్ స్టెయిన్‌లెస్ స్టీల్ ట్యాంక్, కాంపాక్ట్ వాల్‌మౌంట్ డిజైన్, ఎల్ఈడీ సూచికలను ఇందులో పొందుపరిచింది. రోజువారీ గృహ అవసరాలకు అనుగుణంగా గతంతో పోలిస్తే సుమారు 18 శాతం అధిక వేడినీటి సామర్థ్యాన్ని అందిస్తుందని తెలిపింది. ట్యాంక్‌పై ఐదేళ్లు, హీటింగ్ ఎలిమెంట్‌పై రెండేళ్లు, మొత్తం ఉత్పత్తిపై రెండేళ్ల వారంటీని ప్రకటించింది. ఈ సందర్భంగా క్రాంప్టన్ గ్రీవ్స్ కన్స్యూమర్ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ హోమ్ ఎలక్ట్రికల్స్ బిజినెస్ హెడ్ సచిన్ ఫర్తియాల్ మాట్లాడుతూ, పనితీరు, భద్రత విషయంలో రాజీ పడకుండా వినియోగదారులకు మెరుగైన సౌకర్యాన్ని అందించడమే లక్ష్యమని తెలిపారు. కఠిన జలాలు, అధిక నీటి పీడనం వంటి సమస్యలను దృష్టిలో ఉంచుకుని ఈ శ్రేణిని రూపొందించినట్లు పేర్కొన్నారు.

బిజినెస్

వడ్డీరేట్లను యథాతథంగా ఉంచిన అమెరికా కేంద్ర బ్యాంక్



అగ్రరాజ్యం అమెరికాలో ద్రవ్యోల్బణం ఆందోళనకరస్థాయిలో కొనసాగుతున్నప్పటికీ.. ఆ దేశ కేంద్ర బ్యాంక్ అయిన ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను యథాతథంగా ఉంచింది. అమెరికా మధ్యంతర ఎన్నికల ముందు ఈ మేరకు కీలక నిర్ణయం తీసుకుంది. రెండు రోజులపాటు జరిగిన పాలసీ సమావేశం అనంతరం.. వడ్డీ రేట్లను 3.75% నుంచి 4.00% శ్రేణిలోనే కొనసాగిస్తున్నట్లు ప్రకటించింది. భవిష్యత్తులో అనుసరించాల్సిన విధానాలపై స్పష్టత కోసం ఇంకొంత సమాచారాన్ని విశ్లేషించాల్సి ఉందని, అందుకే ఈసారి పెంపునకు విరామం ఇస్తున్నామని తెలిపింది. ద్రవ్యోల్బణం ఇంకా అధిక స్థాయిలోనే ఉందని ఫెడ్ తన ప్రకటనలో పేర్కొన్నది. వడ్డీ రేట్ల పెంపును నిలిపివేయడంవల్ల మరిన్ని వివరాలను సేకరించి విశ్లేషించేందుకు అవకాశం లభిస్తుందని తెలిపింది. ద్రవ్యోల్బణాన్ని తిరిగి రెండు శాతం లక్ష్యానికి సకాలంలో చేర్చేందుకు ఎలాంటి విధానాలు అవసరమో నిర్ధారించడానికి ఈ సమాచారం ఉపయోగపడుతుందని పేర్కొన్నది. అమెరికాలో ద్రవ్యోల్బణాన్ని నియంత్రించేందుకు వడ్డీరేట్లను పెంచడం లేదా తగ్గించడం వంటి నిర్ణయాలను ఫెడ్ తీసుకుంటుంది. వడ్డీరేట్ల పెంపు ద్వారా రుణాలను, ఖర్చులను తగ్గించి ధరల పెరుగుదలకు అడ్డుకట్ట వేస్తుంది. గత నెలలోనే ఫెడ్ చైర్మన్ కెవిన్ వార్ష్ నేతృత్వంలోని కమిటీ.. మూడేళ్లలో తొలిసారిగా వడ్డీ రేట్లను పెంచింది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రేట్లను తగ్గించాలని డిమాండ్ చేసినప్పటికీ ద్రవ్యోల్బణాన్ని కట్టడిచేసే లక్ష్యంతో ఫెడ్ ఈ నిర్ణయం తీసుకుంది. సెప్టెంబర్ నెలలో అమెరికాలో వినియోగదారుల ధరలు గత ఏడాదితో పోలిస్తే 3.7% పెరిగాయి. ఇరాన్ యుద్ధానికి ముందు ఫిబ్రవరిలో ఇది కేవలం 2.4% గానే ఉంది. యూఎస్ ఫెడ్ వడ్డీ రేట్లను యథాతథంగా ఉంచినప్పటికీ ఇది ప్రపంచ ఈక్విటీ మార్కెట్లకు సానుకూల సంకేతం కాదని నిపుణులు విశ్లేషిస్తున్నారు. కర్మ క్యాపిటల్ పోర్ట్‌ఫోలియో మేనేజర్ థామస్ ప్రిజు మాట్లాడుతూ.. ఫెడ్ రేట్లను మార్చకపోవడం సానుకూలంగా కనిపించినా, ఇది తాత్కాలిక విరామం మాత్రమే కావచ్చునని అభిప్రాయపడ్డారు. ఫెడ్ పాలసీ కమిటీలో జరిగిన ఓటింగ్‌లో 10-2 తేడాతో ఈ నిర్ణయం తీసుకున్నారని, ఇద్దరు సభ్యులు 25 బేసిస్ పాయింట్ల పెంపునకు మొగ్గు చూపారని తెలిపారు. ద్రవ్యోల్బణం ఎక్కువగా ఉన్న నేపథ్యంలో కమిటీలో భిన్నాభిప్రాయాలు ఉన్నాయని ఇది స్పష్టం చేస్తోందని పేర్కొన్నారు. భారత ఈక్విటీ మార్కెట్లపై దీని ప్రభావం గణనీయంగా ఉండవచ్చని ఆయన అంచనా వేశారు. భవిష్యత్తులో అమెరికా వడ్డీ రేట్లను పెంచితే యూఎస్ బాండ్ ఈల్డ్స్, డాలర్ విలువ మరింత పెరుగుతాయని థామస్ ప్రిజు తెలిపారు. దీనివల్ల భారత్ వంటి వర్ధమాన దేశాల మార్కెట్లలోకి వచ్చే విదేశీ పెట్టుబడుల ప్రవాహంపై ఒత్తిడి పెరుగుతుందని, ఫలితంగా నిఫ్టీలో ఒడిదొడుకులు తీవ్రమవుతాయని అన్నారు. ముఖ్యంగా అధిక వ్యాల్యుయేషన్ ఉన్న స్టాక్స్, విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడులపై ఎక్కువగా ఆధారపడిన రంగాల షేర్లు ప్రపంచ ద్రవ్యలభ్యత పరిస్థితుల్లో మార్పులకు సున్నితంగా ప్రభావితమయ్యే ప్రమాదం ఉందని థామస్ ప్రిజు హెచ్చరించారు.

పరీక్ష సమయంలో సైబర్ దాడికి పాల్పడిన చైనా ఏఐ మోడల్!

ఏఐ సాంకేతికత వేగంగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో ప్రపంచ దేశాలను కలవరపెట్టే ఒక సంచలన వార్త వెలుగులోకి వచ్చింది. ప్రముఖ చైనా ఏఐ సంస్థకు చెందిన ఫ్లాగ్‌షిప్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మోడల్.. నియంత్రిత పరీక్షా సిమ్యులేషన్లలో అత్యంత సంక్లిష్టమైన సైబర్ దాడిని విజయవంతంగా నిర్వహించినట్లు పరిశోధకులు వెల్లడించారు. అంతేకాకుండా ఈ ప్రయోగాల సమయంలో ఆ మోడల్ పదేపదే భద్రతా నిబంధనలను, ఆదేశాలను బేఖాతరు చేసినట్లు తేలింది. ఇది భవిష్యత్తులో డిజిటల్ భద్రతకు పెనుముప్పుగా పరిణమించే అవకాశం ఉందన్న ఆందోళనలను వ్యక్తం చేస్తోంది.

నియంత్రిత పరీక్షల్లో ఏం జరిగింది?

టెక్నాలజీ రంగంలో నూతన ఆవిష్కరణలు జరుగుతున్నప్పటికీ వాటివల్ల కలిగే దుష్పరిణామాలపై నిపుణులు ఎప్పటికప్పుడు నిఘా ఉంచుతారు. ఇందులో భాగంగానే చేపట్టిన కంట్రోల్డ్ టెస్టింగ్ (నియంత్రిత పరీక్షలు) సమయంలో చైనాకు చెందిన జెడ్.ఏఐ సంస్థకు చెందిన ఏఐ మోడల్ ప్రవర్తన పరిశోధకులను విస్మయానికి గురిచేసింది. మనుషుల ప్రమేయం లేకుండానే స్వయంగా నిర్ణయాలు తీసుకోగల ఈ మోడల్ డిజిటల్ నెట్‌వర్క్‌లలోని లోపాలను ఆసరాగా చేసుకొని కాంప్లెక్స్ సైబర్ దాడికి పాల్పడింది. అత్యంత కఠినమైన భద్రతా వలయాలు, నిబంధనల మధ్య నిర్వహించిన ఈ పరీక్షల్లో ఇచ్చిన ఆదేశాలను పాటించకుండా తనంతట తానుగా వ్యవహరించడం టెక్ వర్గాల్లో కలవరం రేపుతోంది.



భద్రతా నిపుణుల ఆందోళనలు

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ నమూనాలు వేగంగా పరిపక్వత చెందుతుండటం, ఓపెన్-వెయిట్ ఆర్కిటెక్చర్‌ల ద్వారా వాటిని ఎవరైనా సులభంగా డౌన్‌లోడ్ చేసుకుని తమ అవసరాలకు తగ్గట్టు మార్చుకునే అవకాశం ఉండటం సైబర్ సెక్యూరిటీకి సవాల్‌గా మారుతోంది. కొన్ని సందర్భాల్లో ఈ ఏఐ టూల్స్ కోడ్ విశ్లేషణ, ఎర్రర్‌లను గుర్తించడంలో ఎంత వేగంగా పనిచేస్తున్నాయో, అదే స్థాయిలో సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కితే విధ్వంసం సృష్టించడంలోనూ అంతే ప్రమాదకరంగా మారుతున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

అమాంతం పడిపోయిన గూగుల్ షేర్లు.. రూ.26 లక్షల కోట్లు ఆవిరి

ఇంటర్నెట్‌డెస్క్: టెక్ దిగ్గజం గూగుల్ మాతృసంస్థ ఆల్ఫాబెట్ షేర్లు అమాంతం క్షీణించాయి బుధవారం (అమెరికా కాలమానం ప్రకారం) ట్రేడింగ్ ప్రారంభమైన కొన్ని గంటల్లోనే 11 శాతం వరకు పడ్డాయి. ఏఐ సేవలకు భారీగా డిమాండ్ ఉన్నప్పటికీ.. పెట్టుబడి నష్టాలు, పెరుగుతున్న ఖర్చులతో మదుపర్లకు లాభాలు ఆశించిన స్థాయిలో కనిపించడం లేదు. దాంతో ఆల్ఫాబెట్ త్రైమాసిక ఫలితాలు వాల్‌స్ట్రీట్ అంచనాలను అందుకోలేకపోయాయి. ఫలితంగా అమెరికా మార్కెట్లలో ఆల్ఫాబెట్ షేర్లు తీవ్ర ఒత్తిడి ఎదుర్కొన్నాయి. కంపెనీ మార్కెట్ విలువలో 280 బిలియన్ డాలర్ల సంపద ఆవిరయింది. అంటే భారత కరెన్సీలో ఆ మొత్తం దాదాపు రూ.26 లక్షలకోట్లు మూడో త్రైమాసికంలో ఆల్ఫాబెట్‌కు గూగుల్ క్లౌడ్ విభాగం నుంచి వచ్చిన ఆదాయం 30.7 బిలియన్ల డాలర్లకు చేరింది. గూగుల్ సెర్చ్, యూట్యూబ్ విభాగాల ఆదాయంలో వృద్ధి ఆశించిన స్థాయిలో లేకపోయినా.. క్లౌడ్ ఆదాయంతో సర్దుబాటు అయ్యింది. అయితే, ఈ ఫలితాలు పెట్టుబడిదారులను మాత్రం



మెప్పించలేపోకపోయాయి. కంపెనీ మొత్తం ఆదాయంలో వృద్ధి కనిపించినా.. నికర లాభాలు, ఒక్కో షేర్‌పై వచ్చే లాభం అంచనాల కంటే తక్కువగా నమోదయ్యాయి. ఏఐ, క్లౌడ్ సదుపాయాలను విస్తరించేందుకు ఆల్ఫాబెట్ భారీగా ఖర్చుచేస్తోంది. దాంతో నగదు లభ్యత తగ్గిపోవడం పెట్టుబడిదారుల్లో ఆందోళన కలిగిస్తోంది. అలాగే పెట్టుబడులకు తగ్గట్టుగా సమీపకాలంలో లాభాలు వస్తాయా..? అనే అనుమానాల కారణంగా షేర్లలో అమ్మకాల ఒత్తిడి కనిపించింది.

అత్యంత విలువైన ఐపీఎల్ ఫ్రాంచైజీగా ముంబై.. ప్రతి ఫ్రాంచైజీ విలువ రూ.14,000 కోట్లకు పైనే!

అత్యంత విలువైన ఐపీఎల్ ఫ్రాంచైజీగా రూ.20,000 కోట్లతో ముంబై ఇండియన్స్

ప్రతి ఐపీఎల్ జట్టు విలువ 1.5 బిలియన్ డాలర్లకు పైమాటే

విలువలో ముంబై తర్వాత స్థానాల్లో ఆర్సీబీ, చెన్నై సూపర్ కింగ్స్

వృద్ధి రేటులో అమెరికా ఎన్ఎఫ్ఎల్, ఎన్బీఏ లీగ్‌లను అధిగమించిన ఐపీఎల్

ఫ్రాంచైజీల ప్రధాన ఆదాయ వనరు బీసీసీఐ మీడియా హక్కుల వాటా

ప్రపంచ క్రీడా యవనికపై ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) తన ఆధిపత్యాన్ని మరోసారి చాటుకుంది. తాజాగా స్పోర్టికో నివేదిక ప్రకారం, ముంబై ఇండియన్స్ (ఎంఐ) ఫ్రాంచైజీ 2.1 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 20,008 కోట్లు) అద్భుతమైన విలువతో ప్రపంచంలోనే అత్యంత విలువైన ఐపీఎల్ జట్టుగా అగ్రస్థానంలో నిలిచింది. ఈ నివేదిక ప్రకారం.. ఐపీఎల్‌లోని ప్రతి ఫ్రాంచైజీ విలువ ఇప్పుడు కనీసం 1.5 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 14,292 కోట్లు) మార్కును దాటడం విశేషం.

విలువ పరంగా ముంబై ఇండియన్స్ తర్వాత రాయల్



ఛాలెంజర్స్ బెంగళూరు 1.85 బిలియన్ డాలర్లతో (రూ. 17,626 కోట్లు) రెండో స్థానంలో, చెన్నై సూపర్ కింగ్స్ 1.75 బిలియన్ డాలర్లతో (రూ. 16,674 కోట్లు) మూడో స్థానంలో నిలిచాయి. కోల్‌కతా నైట్ రైడర్స్ 1.73 బిలియన్ డాలర్లతో నాలుగో స్థానంలో ఉండగా, ఢిల్లీ క్యాపిటల్స్ 1.7 బిలియన్ డాలర్లతో లీగ్ సగటు విలువకు సమానంగా ఉంది. మిగతా జట్లలో రాజస్థాన్ రాయల్స్ (1.65 బిలియన్ డాలర్లు), సన్‌రైజర్స్ హైదరాబాద్ (1.62 బిలియన్ డాలర్లు), గుజరాత్ టైటాన్స్ (1.58 బిలియన్ డాలర్లు), పంజాబ్ కింగ్స్ (1.53 బిలియన్ డాలర్లు) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. 2008లో ఐపీఎల్ ప్రారంభమైన నాటి నుంచి ఫ్రాంచైజీల విలువలో అసాధారణ వృద్ధి నమోదైంది. గత 18 ఏళ్లలో లీగ్ ఫ్రాంచైజీల విలువ ఏకంగా 1,800% పెరిగింది. ఇదే సమయంలో అమెరికాకు చెందిన ప్రముఖ స్పోర్ట్స్ లీగ్‌లైన ఎన్ఎఫ్ఎల్ (800%), ఎన్బీఏ (1700% లోపు) వృద్ధి రేటు కంటే ఇది చాలా ఎక్కువ కావడం విశేషం. ముంబై ఇండియన్స్ విలువ కొన్ని నార్త్ అమెరికన్ స్పోర్ట్స్ ఫ్రాంచైజీలైన డెట్రాయిట్ టైగర్స్, వాంకోవర్ కానక్స్ కంటే అధికంగా ఉండటం ఐపీఎల్ బ్రాండ్ బలాన్ని సూచిస్తోంది.

ఫ్రాంచైజీలకు ఆదాయం ఎలా వస్తుంది?

ఐపీఎల్ జట్లకు ప్రధాన ఆదాయ వనరు బీసీసీఐ నుంచి వచ్చే సెంట్రల్ రెవెన్యూ పూల్. ముఖ్యంగా బ్రాడ్‌కాస్ట్, డిజిటల్ మీడియా హక్కుల ద్వారా బీసీసీఐకి భారీ ఆదాయం సమకూరుతుంది. ఇందులో సగం వాటాను బోర్డు ఉంచుకుని, మిగిలిన మొత్తంలో దాదాపు 90% అన్ని ఫ్రాంచైజీలకు సమానంగా పంచుతుంది. మరో 10% జట్ల ప్రదర్శన ఆధారంగా లభిస్తుంది. దీని ద్వారా ప్రతి ఫ్రాంచైజీకి ఏటా సుమారు 50-55 మిలియన్ డాలర్లు (రూ. 476 కోట్ల నుంచి రూ. 523 కోట్ల వరకు) అందుతాయి. ఇది కాకుండా టికెట్ల అమ్మకాలు, స్పాన్సర్‌షిప్‌లు, వాణిజ్య భాగస్వామ్యాల ద్వారా కూడా జట్లు అదనపు ఆదాయాన్ని పొందుతాయి. వేలంలో ఆటగాళ్ల జీతాలపై పరిమితులు ఉండటం, నిర్వహణ ఖర్చులు తక్కువగా ఉండటంతో ఫ్రాంచైజీలు భారీ లాభాలను ఆర్జిస్తున్నాయి. కొన్ని జట్ల లాభాల మార్జిన్ 30% దాటుతుండటంతో ఐపీఎల్ ఫ్రాంచైజీలు ప్రపంచంలోనే అత్యంత ఆకర్షణీయమైన పెట్టుబడులుగా మారాయి.

స్పోర్ట్స్

ఆంధ్రపై ఛత్తీస్‌గఢ్ విజయం

ఉత్కంఠభరిత పోరులో ఆంధ్రకు నిరాశ

విజయవాడ స్పోర్ట్స్, మహానగర్



రంజీ ట్రోఫీ ఎలైట్ గ్రూప్-బి 2026-27లో భాగంగా మూలపాడులోని డీవీఆర్ గ్రౌండ్‌లో ఆంధ్ర, ఛత్తీస్‌గఢ్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఛత్తీస్‌గఢ్ ఐదు వికెట్ల తేడాతో విజయం సాధించింది. నాలుగో రోజు లక్ష్య ఛేదనలో ఛత్తీస్‌గఢ్ బ్యాటర్లు ఆంధ్ర బౌలర్లను సమర్థవంతంగా ఎదుర్కొని జట్టుకు విజయాన్ని అందించారు. ఈ విజయంతో ఛత్తీస్‌గఢ్‌కు ఆరు పాయింట్లు లభించగా, ఆంధ్ర జట్టుకు పాయింట్లు దక్కలేదు. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన ఆంధ్ర తొలి ఇన్నింగ్స్‌లో 73.2 ఓవర్లలో 231 పరుగులకు ఆలౌట్ అయింది. ఎస్.వి. రాహుల్ 173 బంతుల్లో ఏడు ఫోర్లు, ఒక సిక్సర్‌తో 89 పరుగులు చేసి టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఛత్తీస్‌గఢ్ బౌలర్లలో జయంత్ యాదవ్ నాలుగు, అజయ్ మండల్ మూడు వికెట్లు పడగొట్టారు. అనంతరం ఛత్తీస్‌గఢ్ తొలి ఇన్నింగ్స్‌లో 107.3 ఓవర్లలో 237 పరుగులకు ఆలౌటై ఆరు పరుగుల స్వల్ప ఆధిక్యం సాధించింది. అమన్‌దీప్ ఖరే 202 బంతుల్లో ఎనిమిది ఫోర్లతో 89 పరుగులు చేశాడు. ఆంధ్ర బౌలర్లలో త్రిపురాన విజయ్ నాలుగు, సౌరభ్ కుమార్ మూడు వికెట్లు తీశారు. రెండో ఇన్నింగ్స్‌లో ఆంధ్ర దూకుడుగా ఆడి 32 ఓవర్లలో మూడు వికెట్లకు 184 పరుగులు చేసి డిక్లేర్ చేసింది. రికీ భుయ్ 75 బంతుల్లో నాలుగు ఫోర్లు, మూడు సిక్సర్లతో అజేయంగా 72 పరుగులు చేయగా, కరణ్ షిండే 54 బంతుల్లో ఆరు ఫోర్లు, ఒక సిక్సర్‌తో అజేయంగా 53 పరుగులు సాధించాడు. 179 పరుగుల లక్ష్య ఛేదనకు దిగిన ఛత్తీస్‌గఢ్ 35.1 ఓవర్లలో ఐదు వికెట్లకు 182 పరుగులు చేసి గెలుపొందింది. అనుజ్ తివారీ 73 బంతుల్లో ఏడు ఫోర్లు, ఒక సిక్సర్‌తో 60 పరుగులు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఆంధ్ర తరపున సౌరభ్ కుమార్ మూడు వికెట్లు తీసినా, జట్టును ఓటమి నుంచి గట్టెక్కించలేకపోయాడు.

ఒత్తిడి బౌలర్‌కే, నాకు కాదు..

తొలి బంతి నుంచి బాదడమే :తిలక్ వర్మ



భారత టీ20 జట్టు వైస్ కెప్టెన్ తిలక్ వర్మ తన కొత్త బ్యాటింగ్ పాత్రపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. గతంలో మూడో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన తాను, ప్రస్తుతం జట్టు అవసరాల రీత్యా ఐదు లేదా ఆరో స్థానంలో ఫినిషర్‌గా వస్తున్నానని, దీనివల్ల తన ఆలోచనా విధానం, ఆటతీరు పూర్తిగా మారాయని తెలిపాడు. న్యూజిలాండ్‌తో నాలుగో టీ20కి ముందు తిలక్ మీడియాతో మాట్లాడాడు. "గతంలో మూడో స్థానంలో ఆడేటప్పుడు క్రీజులో కుదురుకోవడానికి కొంత సమయం తీసుకునేవాడిని. కానీ ఇప్పుడు ఐదు, ఆరు స్థానాల్లో వస్తుండటంతో, వీలుంటే తొలి బంతి నుంచే బౌండరీ కొట్టాలని ఆలోచిస్తున్నా. లేదంటే, మ్యాచ్‌ను చివరి వరకు తీసుకెళ్లడంపై దృష్టి పెడతాను. మొదట్లో సింగిల్స్, డబుల్స్ తీస్తూ, గ్యాప్స్‌లో ఫోర్లు కొట్టే ప్రయత్నం చేస్తాను" అని తిలక్ వర్మ వివరించాడు. తనలో పవర్ గేమ్ ఎప్పుడూ ఉందని, అయితే కొత్త పాత్రకు అనుగుణంగా మారానని చెప్పాడు. న్యూజిలాండ్‌తో రెండో టీ20లో కేవలం 26 బంతుల్లో 51 పరుగులతో అజేయంగా నిలిచి జట్టును గెలిపించడంపై తిలక్ స్పందించాడు. "డెత్ ఓవర్లలో బ్యాటర్‌గా నా కంటే బౌలర్‌పైనే ఎక్కువ ఒత్తిడి ఉంటుంది. ఆ సానుకూల దృక్పథం నా మదిలో ఎప్పుడూ ఉంటుంది. ఒత్తిడిలో ఉన్న బౌలర్ కచ్చితంగా పరుగులు ఇస్తాడని నమ్ముతాను" అని అన్నాడు. ఆ మ్యాచ్‌లో నితీశ్ రెడ్డితో కలిసి ఏడో వికెట్‌కు 69 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పిన విషయాన్ని గుర్తుచేసుకున్నాడు. "మనం ఇక్కడి నుంచి మ్యాచ్ గెలిపిస్తే ఆ మజానే వేరుగా ఉంటుంది. చివరి వరకు ఉండి చూద్దాం అని నితీశ్‌తో చెప్పాను" అని తెలిపాడు. వెస్టిండీస్‌తో సిరీస్ ముగిసిన వెంటనే న్యూజిలాండ్‌కు రావడంతో అక్కడి పరిస్థితులకు, టైమ్ జోన్‌కు అలవాటు పడటం సులువు కాదని, కానీ అంతర్జాతీయ స్థాయిలో ఉన్నప్పుడు సాకులు చెప్పకూడదని తిలక్ అన్నాడు. "గౌతమ్ గంభీర్ సర్ సమావేశంలో స్పష్టంగా చెప్పారు. ఇది సుదీర్ఘ పర్యటన అని, టీ20 జట్టుగా మనం నిర్దేశించే ప్రమాణాలు వన్డే, టెస్ట్ జట్లకు ఊపునిస్తాయని అన్నారు"

‘కల్ట్’ రిలీజ్ ట్రైలర్.. రక్తపాతం, భయంకరమైన హత్యలతో విశ్వక్ సేన్ విశ్వరూపం!



జబర్దస్త్ । టాలీవుడ్ నటుడు విశ్వక్ సేన్ మరోసారి దర్శకుడిగా తన సత్తా చాటేందుకు సిద్ధమయ్యారు. ఆయన దర్శకత్వంలో తెరకెక్కిన తాజా చిత్రం ‘కల్ట్’ ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమైంది. భారతీయ సినిమాలో తొలి స్లాషర్ చిత్రంగా ప్రచారం పొందుతున్న ఈ సినిమాకు ‘ఏ’ సర్టిఫికెట్ లభించింది. థియేటర్లలో విడుదలకు కొన్ని గంటల ముందు చిత్రబృందం రిలీజ్ ట్రైలర్‌ను విడుదల చేసింది. కత్తిపోట్లు, కోతలు, భయపెట్టే సన్నివేశాలతో నిండిన ఈ ట్రైలర్ సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. ఇప్పటికే విడుదలైన తొలి ట్రైలర్‌లో సినిమా నేపథ్యాన్ని పరిచయం చేస్తూ, ఓ పార్టీలో జరిగే హింసాత్మక ఘటనల గురించి చూపించారు. తాజాగా వచ్చిన రిలీజ్ ట్రైలర్‌లో మాత్రం విశ్వక్ సేన్ పోషించిన డీఎస్పీ సంకల్ప్ నాయక్ పాత్రకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారు. గోవాలో స్థానికులు స్థానికేతరులను, ముఖ్యంగా తెలుగు వారిని ఇబ్బందులకు గురిచేయడాన్ని సంకల్ప్ సహించడు. వారిని రక్షించాలనే ఉద్దేశంతో గోవాకు వెళ్లిన అతడి చుట్టూ కథ తిరుగుతుంది. ట్రైలర్ చివర్లో పార్టీలో అతడు సాగించే హత్యాకాండను చూపించారు. యాక్షన్‌తో పాటు స్లాషర్ తరహా సన్నివేశాలు ట్రైలర్‌లో ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. సంకల్ప్ నాయక్ పాత్రలో విశ్వక్ సేన్ దూకుడు, క్రూరత్వం స్పష్టంగా కనిపిస్తున్నాయి. పాత్రకు తగ్గట్టుగా ఆయన ఆగ్రహభరితమైన నటన ఆకట్టుకుంటోంది. హింసాత్మక సన్నివేశాలను కూడా ప్రత్యేకమైన శైలిలో, కొంత కార్టూన్ తరహా రూపంలో తెరకెక్కించడంతో సినిమాపై ఆసక్తి పెరిగింది. ఈ చిత్రంలో మురళీ శర్మ రాజకీయ నాయకుడిగా, శ్రీకాంత్ అయ్యంగార్ సీనియర్ పోలీసు అధికారిగా నటిస్తున్నారు. గాయత్రి భరద్వాజ్, తారక్ పొన్నప్ప తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. తారక్ సినిమాస్ పతాకంపై సందీప్ కకరాల ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రవి బస్రూర్ సంగీతాన్ని అందించగా, తరుణ్ భాస్కర్ సంభాషణలు రాశారు. విడుదల ట్రైలర్‌లో కనిపిస్తున్న రక్తపాతం, వేగవంతమైన యాక్షన్ సన్నివేశాలు సినిమాపై అంచనాలను పెంచుతున్నాయి. మరి ‘కల్ట్’ ప్రేక్షకులను ఏ మేరకు ఆకట్టుకుంటుందో చూడాలి.



అది సీక్వెల్ కాదు.. అక్కడితోనే క్లోజ్.. ధనుష్ ‘ఓం’ సినిమాపై క్లారిటీ ఇచ్చిన డైరెక్టర్!

కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ హీరోగా, టాలెంటెడ్ డైరెక్టర్ రాజ్ కుమార్ పెరియసామి దర్శకత్వంలో తెరకెక్కుతున్న హై-వోల్టేజ్ యాక్షన్ థ్రిల్లర్ ‘ఓం -- చాప్టర్ 1 ‘అమరన్’ వంటి బ్లాక్‌బస్టర్ విజయం తర్వాత రాజ్ కుమార్ పెరియసామి తెరకెక్కిస్తుండటంతో ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా ఈ చిత్రానికి సంబంధించి దర్శకుడు రాజ్ కుమార్ పెరియసామి వెల్లడించిన ఆసక్తికరమైన విషయాలు సినిమాపై మరింత హైప్‌ను పెంచుతున్నాయి. ‘ఓం’ చాప్టర్ 1, చాప్టర్ 2 సినిమాల మధ్య ఎలాంటి సంబంధం లేదని దర్శకుడు స్పష్టం చేశారు. ఈ సినిమా టైటిల్‌లో ‘చాప్టర్ 1’ అని ఉన్నప్పటికీ, ఇది రెండు భాగాలుగా కొనసాగే సీక్వెల్ కాదని, మొదటి భాగంతోనే ఈ కథ పూర్తిగా ముగిసిపోతుందని ఆయన వెల్లడించారు. అలాగే తాము ఈ చిత్రాన్ని కేవలం ఒక భాషలో మాత్రమే కాకుండా, ద్విభాషా చిత్రంగా ప్లాన్ చేయనప్పటికీ.. తమిళ మరియు తెలుగు ప్రేక్షకులు ఇద్దరూ దీన్ని తమ సొంత ప్లైట్ సినిమా అనే అనుభూతిని పొందుతారని ధీమా వ్యక్తం చేశారు. ఈ చిత్రంలో నటీనటుల పాత్రలు అంత్యంత ప్రత్యేకంగా ఉంటాయని దర్శకుడు తెలిపారు. ముఖ్యంగా నేచురల్ బ్యూటీ సాయి పల్లవి (ఏఎస్‌పీ నిత్యా రెడ్డి పాత్రలో) మరియు టాలెంటెడ్ యంగ్ హీరోయిన్ శ్రీలీల ఇద్దరి పాత్రలు వారి ఇప్పటివరకు చేసిన సినిమాలకు, వారి కంఫర్ట్ జోన్‌కు పూర్తిగా భిన్నంగా, అవుట్ అండ్ అవుట్ కొత్తగా ఉంటాయని పేర్కొన్నారు. ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో ధనుష్‌తో పాటు మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి, దిగ్గజ నటుడు నసీరుద్దీన్ షా వంటి ప్రముఖులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. వండర్‌బార్ ఫిలింస్ మరియు ఆర్‌టేక్ స్టూడియోస్ పతాకాలపై అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి సాయి అభ్యంకర్ సంగీతం అందిస్తున్నారు. అన్ని హంగులను పూర్తి చేసుకుని ప్రపంచవ్యాప్తంగా నవంబర్ 20న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది.

ఆ సీన్లు నాకూ నచ్చలేదు.. పెద్ది సినిమాపై జాన్వీ కపూర్ తీవ్ర వ్యాఖ్యలు



టాలీవుడ్ హీరో రామ్ చరణ్, దర్శకుడు బుచ్చిబాబు సానా కాంబినేషన్‌లో తెరకెక్కిన చిత్రం ‘పెద్ది’. ఈ సినిమాలో హీరోయిన్‌గా నటించిన జాన్వీ కపూర్ పాత్రపై గతంలో పలు విమర్శలు వచ్చాయి. ముఖ్యంగా సినిమాలో మహిళలను చూపించిన తీరుపై సోషల్ మీడియాలో చర్చ నడిచింది. ఈ నేపథ్యంలో జాన్వీ కపూర్ ఈ వివాదంపై స్పందించారు. తాజాగా ‘కాఫీ విత్ కరణ్’ షోలో మాట్లాడిన ఆమె.. సినిమాలో తన రోల్, మహిళలను చూపించిన విధానంపై వచ్చిన విమర్శలు నిజమేనని ఓపెన్‌గా ఒప్పేసుకున్నారు. ‘పెద్ది మూవీ చిత్రీకరణ సమయంలోనే కొన్ని సన్నివేశాల విషయంలో అసౌకర్యంగా అనిపించింది. వాటిపై మరింత గట్టిగా నా అభిప్రాయాన్ని వ్యక్తం చేసి ఉండాల్సింది. కొన్ని సన్నివేశాల విషయంలో మరింత బలంగా మాట్లాడాల్సింది. కొన్ని సీన్లు నాకూ నచ్చలేదు. భవిష్యత్తులో ఇలాంటి పొరపాట్లు మళ్లీమళ్లీ జరగకుండా చూసుకోవడమే నాకున్న ఏకైక మార్గం. దీని గురించి ఇప్పటివరకూ నేను స్పందించకపోవడానికి కారణం ఏంటంటే.. ఆ సినిమా కోసం చాలా మంది కష్టపడ్డారు. అందుకే మౌనంగా ఉన్నాను’ అని తెలిపారు. పెద్ది థియేటర్లలో విడుదలైన తర్వాత జాన్వీ పాత్రపై, ముఖ్యంగా కొన్ని సన్నివేశాలపై ప్రేక్షకుల నుంచి అప్పట్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. మహిళలను కొన్ని సీన్లలో చూపించే విధానంపై సోషల్ మీడియాలో నెటిజన్లు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విమర్శలపై దర్శకుడు బుచ్చిబాబు సైతం గతంలో స్పందించారు. ఆ తర్వాత వెంటనే స్పందించి వివాదాస్పద సన్నివేశాలను సినిమా నుంచి తొలగించారు.

PRINTED AND PUBLISHED BY MUPPIRISETTY JAGADEESH, On behalf of CATERWEALTH MEDIA LLP, PRINTED at M/S. SREE SESHASAI ENTERPRISES, D.NO. NEW. 3-88, OLD. 3-22, GOSALA, CHANDRA THEATER ROAD, PENAMALURU-521151, KRISHNA DISTRICT, ANDHRA PRADESH, PUBLISHED AT CATERWEALTH MEDIA LLP, 3RD FLOOR, 59-12-9A, FIRST LINE, GAYATHRI NAGAR, VIJAYAWADA, NTR DISTRICT, ANDHRA PRADESH. EDITOR: MUPPIRISETTY JAGADEESH. RNI REGD NO. APTEL/2016/70247, Email I D : mahanagarap@gmail.com Phone : 9044417999